


# విజయభాను

విజయవాడ, శనివారం 08-07-2017 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక : 35 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## బాధితులకు సీఎం చంద్రబాబు సహాయం!



అమరావతి: ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శకుల సమస్యలు శుక్రవారం సావధానంగా విన్నారు. ఒక్కొక్కరూ తమ సమస్యను సీఎంకు వివరించగా, ఆయన అక్కడికక్కడే సహాయం ప్రకటించారు. బాధితులకు వీలైనంత త్వరగా సహాయం అందజేయాలని అధికారులను ఆదేశించారు. తలసేమియా వ్యాధితో బాధపడు తున్న తమ కుమార్తెను ఆదుకోవాలని అనంతపురం జిల్లా బుక్కపట్నం మండలం పాముదుర్తి గ్రామానికి చెందిన బేబీ తేజస్విని తల్లిదండ్రులు చేసిన వినతికి చంద్రబాబు స్పందించారు. వైద్యసహాయం కోసం రూ.3లక్షలు ప్రకటించారు. నెలలు నిండకుండానే పుట్టిన బేబీ సుదీప్తికి రూ.5లక్షలతో పాటు మరింత మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఏలూరుకు చెందిన గురిజాల నాగేశ్వరరావుకు రూ.2.5లక్షలు, తల్లిదండ్రులను కోల్పోయిన ఇంజినీరింగ్ విద్యార్థిని దీపికకు రూ.లక్ష ఆర్థిక సహాయం ప్రకటించారు. అగ్నిప్రమాదంలో రెండు చేతులు కోల్పోయిన విజయవాడ రాజేశ్వరీదేవిపేటకు చెందిన దుర్గారావుకు క్రీడల కోటాలో ఉద్యోగం ఇవ్వాలని అధికారులకు సూచించారు. కృష్ణాజిల్లా వత్సవాయి మండలం పోచవరం గ్రామానికి చెందిన కె.జయ కుటుంబ పరిస్థితులు వివరించగా చలించిన సీఎం చంద్రబాబు రూ. 4లక్షలు ఆర్థికసాయం ప్రకటించారు.

నందిగామకు చెందిన బత్తుల విజయలక్ష్మి కుడికాలికి శస్త్రచికిత్స చేసిన అనంతరం ఏర్పడిన సమస్యలను విన్నవించగా చికిత్స నిమిత్తం రూ.58వేలు ప్రకటించారు. బాధితురాలి చికిత్స పూర్తయ్యేదాకా ప్రభుత్వమే వైద్యఖర్చును భరిస్తుందని సీఎం ప్రకటించారు. సచివాలయం నుంచి ఇంటి వరకూ సురక్షితంగా చేర్చాలని అధికారులను ఆదేశించారు.

## ప్రారంభమైన జీ20 సదస్సు

- హాజరైన ప్రపంచ నేతలు
- బ్రిక్స్ నిర్వహణను అభినందించిన మోదీ
- ఉగ్రవాదంపై భారత్ పోరును ప్రశంసించిన జిన్‌పింగ్



హాంబర్గ్: హాంబర్గ్ వేదికగా జీ20 సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు మోదీ, జిన్‌పింగ్‌లతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్, బ్రిటన్ ప్రధాని థెరిసా మే, జపాన్ ప్రధాని షింజో అబే, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయల్ మేక్రాన్ తదితర ప్రపంచ నేతలు హాజరయ్యారు. వీరికి జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ సాదర స్వాగతం పలికారు.

అయితే సిక్కిం సరిహద్దుల్లో భారత్-చైనా మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెల కొన్న నేపథ్యంలో జీ 20 సదస్సులో మోదీ, జిన్‌పింగ్‌లు కలిసి

తరువాయి 2లో

### అగ్ని ప్రమాదాల నివారణ- రక్షణ చర్యలపై

## సచివాలయంలో మంత్రులు సమావేశం

అమరావతి : శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ఆసుపత్రులు, స్కూల్స్ లో అగ్ని ప్రమాదాల నివారణ- రక్షణ చర్యలపై మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, కామినేని శ్రీనివాస్, డిజి ఫైర్ సేఫ్టీ సత్యనారయణ తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రైవేట్ ఆసుపత్రుల,స్కూల్స్ నిర్మాణంలో త్వరితగతిన ఫైర్ సేఫ్టీ వారు ఎన్‌వోసి ఇవ్వడంలో ఇబ్బందులపై చర్చించారు. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం తమకు ఉన్న సమస్యలను వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకురాగా దీనిపై హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప తో మాట్లాడి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆసుపత్రి భవనం సింగిల్ ఫ్లోర్ అయితే అటువంటి ఆసుపత్రులకు ఎటువంటి ఆంక్షలు లేవని మంత్రి తెలిపారు.

క్లినిక్ ఉండి పడకలు లేని ఆసుపత్రులకు ఎన్‌వోసి అవసరం లేదన్నారు. ఆసుపత్రులకు ప్రతిసంవత్సరం ఎన్‌వోసి రెన్యువల్ కాకుండా 5 సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

2006 ముందు నిర్మించిన పాత ఆసుపత్రులకు ఎన్‌వోసి కోసం ఇబ్బంది పెట్టకూడదని, 2006

తరువాయి 2లో

## రాష్ట్రపతికి జులై 23న వీడ్కోలు



దిల్లీ: రాష్ట్రపతిగా పదవీ విరమణ చేయనున్న ప్రణబ్ ముఖర్జీకి పార్లమెంట్ ఉభయసభలు ఘన వీడ్కోలు పలకనున్నాయి. జులై 23న పార్లమెంట్ సభ్యులు రాష్ట్రపతికి వీడ్కోలు ఇవ్వనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 2012 జులై 25న భారత 13వ రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన

తరువాయి 2లో

## జమ్ము కశ్మీర్‌లో జీఎస్‌టీ బిల్లుకు ఆమోదం




శ్రీనగర్: ప్రతిపక్షాల ఆందోళనల మధ్య జమ్ము కశ్మీర్ శాసనసభ జీఎస్‌టీ బిల్లును ఆమోదించింది.

దీంతో వస్తు సేవల పన్ను అమలు చేయనున్న చివరి రాష్ట్రం జమ్ము కానుంది. జమ్ము-కశ్మీర్ వస్తు సేవల పన్ను బిల్లు 2017 పేరుతో ఉన్న బిల్లును రాష్ట్ర ఆర్థిక మంత్రి హసీబ్ ద్రబు శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టారు.

జీఎస్‌టీ అమలు చేయాలన్న రాష్ట్రపతి ఉత్వర్వును పాటిస్తూ జమ్ము కశ్మీర్ ప్రత్యేక హోదాను ప్రభుత్వం తాకట్టు పెట్టిందంటూ ప్రతిపక్షాలు సభను బహిష్కరించాయి. ఆ తర్వాత బిల్లును మూజువాణి ఓటు ద్వారా ఆమోదించారు. రాత్రి నుంచే రాష్ట్రంలో జీఎస్‌టీ అమల్లోకి రానుంది. జీఎస్‌టీతో జమ్ము కశ్మీర్ స్వయం ప్రతిపత్తికి ఎలాంటి భంగం కలగదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## చట్టప్రకారమే లాలూపై సీబీఐ దాడులు



దిల్లీ: బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబసభ్యుల ఇళ్లల్లో సీబీఐ సోదాలపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు స్పందించారు. ఆర్జేడీ నేతలు ఆరోపిస్తున్నట్లుగా సీబీఐ సోదాల వెనుక కేంద్రం, భాజపా ప్రమేయం లేదని వెంకయ్యనాయుడు తెలిపారు. చట్టం ప్రకారమే సీబీఐ తన విధులు నిర్వర్తించి.. తనిఖీలు చేపట్టిందన్నారు.

2006లో రైల్వేశాఖలో టెండర్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయి. ఆ సమయంలో లాలూ రైల్వే మంత్రిగా పనిచేశారు. పూరీ,

తరువాయి 2లో

## పట్టణ గృహ నిర్మాణ కార్యక్రమంపై సమావేశం నిర్వహించిన కలెక్టర్



గుంటూరు :అందరికి ఇళ్ళు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ కోన శశిధర్ పేర్కొన్నారు. పట్టణ గృహ నిర్మాణ కార్యక్రమంపై శుక్రవారం ఉదయం స్థానిక డి.ఆర్.సి సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటి సమావేశం జరిగింది.

సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ గృహ నిర్మాణ కార్యాక్రమంలో భాగంగా జిల్లాకు మొదటి విడతలో 19,398 గృహాలు మంజూరు కాగా, 15,302 గృహాల నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగిందని తెలిపారు. నర్సారరావుపేట, మంగళగిరి పట్టణాలలో భూమి ఎంపికలో కొంత జాప్యం జరిగినందున టెండర్లు పిలవలేదని, మరొక వారం రోజులో ఆ రెండు పట్టణాలలో కుడా టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. దాదాపు అన్ని మండలాల్లో లబ్దిదారుల ఎంపిక కార్యక్రమం పుర్తయినందున వెంటనే భూములను ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఎ.పి.టిడ్కో) కు స్వాధీనం చేసి పనులు ప్రారంభించేలా చూడాలని చెప్పారు.

రెండవ విడతలో ఈ కార్యక్రమం క్రింద జిల్లాకు 18,582 గృహాలు మంజూరు కాగా, కొన్ని ప్రాంతాల్లో ఎ.పి. టిడ్కో కు భూములు స్వాధీనం చేయవలసి వుందని కలెక్టర్ తెలిపారు. తహశీల్దార్లందరు వెంటనే భూములను స్వాధీనం చేసే ప్రక్రియ పూర్తి చేయాలని, మున్సిపల్ కమీషనర్లు జులై 9వ తేదిలోగా డి.పి.ఆర్ లు సమర్పించాలని ఆదేశించారు. 11 వ తేదిన జరిగే రాష్ట్ర స్థాయి స్టిరింగ్ కమిటి సమావేశంలో డి.పి.ఆర్ లను ఆమోదించి కేంద్రానికి పంపడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడానికి సిద్దంగా ఉందని, లబ్దిదారులు కూడా ఇళ్ళు కట్టుకోడానికి సిద్దంగా ఉన్నారని, త్వరగా నిర్మించి ఇచ్చే బాధ్యతా అధికారులు తీసుకోవాలని అన్నారు. రెవిన్యు, మునిసిపల్, హౌసింగ్ అధికారులు తాను మూడు రోజుల సమయం ఇస్తే 1500 ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు అందజేసినందుకు కలెక్టరు అభినందనలు తెలియజేసారు. గతంలో ఇదే పని చేయాలంటే 6

తరువాయి 2లో




### టిక్కెట్-ఈజీ



ఇప్పుడు చేసే జిమ్మిక్కులు పనికిరావు... ఎన్నికల సర్వేబృందాలని మచ్చిక చేసుకుంటేనే మనకు టిక్కెట్ వచ్చేది !!

## సింహాచలేశుని గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం



సింహాచలం: సింహచలేశునికి భక్తులు గిరి ప్రదక్షిణ ద్వారా తమ మొక్కును చెల్లించుకునేందుకు రంగం సిద్ధమైంది. ఏటా ఆషాడ శుద్ధ చతుర్ధశి నాడు 32 కిలోమీటర్ల దూరం సింహ గిరులు చుట్టిరావడం ద్వారా తమ గిరి ప్రదక్షిణను భక్తులు పూర్తి చేసుకుంటారు. భక్తుల కోలాహలంగా పాల్గొనే ఈ ఉత్సవం కోసం విశాఖలో ప్రధాన రహదార్లపై ట్రాఫిక్ మళ్లిస్తారు. దాదాపు ఐదు లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అంచనా. ఆధ్యాత్మికం, ప్రకృతి పరిశీలన వంటి అంశాల మేళవింపుతో సముద్ర తీరం మీదుగా సాగే ఈ ప్రదక్షిణ వీరిలో కొత్త ఉత్సాహాన్ని నింపనుంది.

ఆషాఢ శుద్ధ చతుర్ధశి నాడు ఏటా సింహాచలంలో గిరిప్రదక్షిణ అనవాయితీగా వస్తోంది. గత రెండు మూడేళ్లుగా గిరి ప్రదక్షిణకు గణనీయంగా భక్తులు పెరగడంతో అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. సింహాచలం శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామికి గిరి ప్రదక్షిణ ఒక భూ ప్రదక్షిణతో సమానమని భక్తుల నమ్మకం. భక్తితో పాటు ప్రకృతిని అస్వాదించే విధంగా అటు కొండలు, ఇటు సముద్ర తీరాన్ని స్పృశిస్తూ సాగే ప్రదక్షిణ ఇది.

స్వామివారిని స్వాంగ సుంద్రంగా అలంకరించి ప్రచారరథంలో అధిష్టింపజేసి ప్రత్యేకపూజలు నిర్వహించి గిరి తిరిగే 32 కిలోమీటర్లు రథయాత్ర నిర్వహించ

తరువాయి 2లో

# క్రీడాభివృద్ధికి మహర్దశ

## జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రమణయ్య

నెల్లూరు : జిల్లాలోని ప్రతి పాఠశాలకు క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీవీ రమణయ్య పేర్కొన్నారు. ఏసీ క్రీడా మైదానంలోని తన ఛాంబర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన క్రీడా విధానంలో భాగంగా జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ స్థాయి పాఠశాలల్లో మైదానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి కనీసం 2 ఎకరాల స్థలం ఉండాలని, ఒక్కో మైదానానికి రూ.5లక్షల చొప్పున ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ఈ పనులు జరుగుతాయన్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 228 గ్రామ పంచాయతీలను గుర్తించగా, అందులో 204 గ్రామాలకు సంబంధించి అంచనాలు తయారుచేశామన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి నిధులు విడుదలయ్యాయని తెలిపారు. డ్వామా, విద్యాశాఖ, క్రీడా ప్రాధికార సంస్థ పర్యవేక్షణలో పనులు జరుగుతాయని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో మినీ స్టేడియాలు, క్రీడా వికాశ కేంద్రాలు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు.

తొలి విడత కింద వెంకటగిరి, ఉదయగిరి, కావలి, కోవూరు నియోజకవర్గాల్లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో మైదానానికి రూ.2 కోట్లతో అవుట్, ఇండోర్ స్టేడియాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు లోని మొగళ్ల పాళెంలో నిర్మించతలపెట్టిన అంతర్జాతీయ స్థాయి మైదానానికి సంబంధించి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇండోర్ స్టేడియం కోసం రూ.8కోట్లు, బీటీ రోడ్ల కోసం రూ.4.60 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

# ఈనెల 10న డివిజన్ స్థాయి శిక్షణ

కర్నూలు : జిల్లాలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ విధానంలో సమస్యలను అధిగమించి మరింత వేగం పెంచి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని జిల్లా విద్యాధికారి తహెరా సుల్తాన సూచించారు. స్థానిక సర్వశిక్షా అభియాన్ సమావేశ భవనంలో బయోమెట్రిక్ సాంకేతిక నిపుణులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మరికొన్ని రోజుల్లో ప్రాథమిక పాఠశాలలకు బయెమెట్రిక్ పరికరాలు సరఫరా చేయనున్నామని, అందుకు శిక్షణ పొందిన సాంకేతిక నిపుణులు ఇతరులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అందుకు డివిజన్ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి శిక్షణ అందజేస్తామన్నారు. ముందుగా ఈనెల 10న కర్నూలు డివిజన్‌కు స్థానిక బి.క్యాంపులోని బాలికల పాఠశాలలో ఉంటుందని, డివిజన్ పరిధిలోని మండల విధ్యాధికారులు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డీటీపీ ఆపరేటర్లు హాజరు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో మారుతి, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలగాలి

హాలహర్వి: ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఇప్పటి నుంచే సేవాభావం అలవరచుకోవాలని ఎంఈవో ఈరన్న అన్నారు. శుక్రవారం హాలహర్వి గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి అనే దాత విద్యార్థులకు పళ్లేలు, పలకలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. గతేడాది కూడా వెంక టేశ్వరరెడ్డి విద్యార్థులకు ఇలాంటి వస్తువు లను పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. ఇలాంటి సేవా భావాలు ప్రతి ఒక్కరూ అల వరచుకొని పాఠ శాల, విద్యార్థుల అభివృద్ధికి పాటు పడాలని ఆయన కోరారు. త్వరలో ప్రాథమిక పాఠశాలకు నీటి ట్యాంకునుఏర్పాటు చేసేలా చూస్తానని దాత హామీ ఇచ్చారు.

# ఘనంగా గంగమ్మ పూజ

కోసిగి: కోసిగిలోని శుక్రవారం రజకుల ఆధ్వర్యంలో ఘనంగా గంగమ్మ పూజలు నిర్వహించారు. ముందుగా స్థానిక కుమ్మరిగేరి వీధి నుంచి కలశాలతో మహిళలు, చిన్నారులు వూరేగింపుగా వచ్చారు. అనంతరం రజకుల సంఘం మండల అధ్యక్షుడు బసవ రాజు, వీరేశ్‌లు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం గంగమ్మ పూజలను ఎంతో ఘనంగా నిర్వహించుకుంటామని తెలిపారు. గంగమ్మ వద్దకు వెళ్లి తీపి వంటలు చేసుకొని సంతోషంగా గడుపు తామని పేర్కొన్నారు. ఇందులో ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు : ఈనెల 8వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేయాలని జిల్లా జడ్జి అనుపమ చక్రవర్తి పేర్కొన్నారు. గురువారమిక్కడి కోర్టులో న్యాయవాదులు, పోలీసు సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ కక్షిదారులకు అవగాహన కల్పించి రాజీ చేయాలని ఆమె సూచించారు. సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్ కేసులు ఉంటే లోక్‌అదాలత్‌లో ఇరువురిని ఒప్పించి రాజీ చేయాలని ఇలా పరిష్కరించుకుంటే కోర్టు, కక్షిదారులకు సమయం ఆదా అవుతుందన్నారు. దీర్ఘకాలికంగా కొనసాగుతున్న వాటిని ఈ కార్యక్రమంలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జి వాసుదేవ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, కార్యదర్శి గురురాజారావు, ఎమ్మిగనూరు సీఐ ప్రసాద్, మంత్రాలయం సీఐ రఘు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు నుంచి పాఠశాలలో బయోమెట్రిక్ విధానం

ఎమ్మిగనూరు: ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆగస్టు 1 నుంచి బయోమెట్రిక్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని దీన్ని తూచా తప్పకుండా ప్రతి ఒక్కరూ అమలు చేయాలని డోన్ ఉపవిద్యాధికారి నాగభూషణం అన్నారు. వైష్ణవి డిగ్రీ కాలేజీలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సమదుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశామని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఏదైనా కొరత ఉంటే తమ ద ృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం కింద పిల్లలకు వారానికి మూడు గుడ్లను అందించాలని చెప్పారు. ఉపాధ్యాయులు ఆయా వంట ఏజెన్సీలకు కొత్త మెనూ గురించి వివరించాలని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఇంకా ఏమైనా సమస్యలున్నా తమ ద ృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రారంభమైన జీ20 సదస్సు

పాల్గొనడంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్న విషయం తెలిసిందే. సదస్సుల్లో భాగంగా శుక్రవారం బ్రిక్స్ దేశాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు ప్రశంసలు కురిపించుకున్నారు. తొలుత మాట్లాడిన ప్రధాని మోదీ.. చైనా నాయకత్వంలో బ్రిక్స్ నిర్వహణను అభినందించారు. అంతేగాక, ఈ ఏడాది చివర్లో చైనాలోని జియామెన్‌లో నిర్వహించే బ్రిక్స్ సదస్సుకు భారత్ పూర్తి మద్దతిస్తుందని తెలిపారు. ఉగ్రవాదంపై ప్రస్తావనలో పాకిస్తాన్‌పై మోదీ విరుచుకుపడ్డారు. వాతావరణ మార్పులు, ఉగ్రవాదంపై అంతర్జాతీయ పోరులో బ్రిక్స్ నాయకత్వం పాత్ర కీలకమైనదని, ఉగ్రవాదులకు నిధులిస్తూ, టెర్రరిస్టులకు తమ భూభాగంలో ఆశ్రయమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. జీ-20 దేశాలు సైతం సమష్టిగా ఉగ్రవాదులు, వారికి అందుతున్న నిధులు, ఉగ్ర సంస్థలకు తమ భూభాగంలో ఆశ్రయమిస్తున్న వారి నడ్డివిరిచాలని అన్నారు. ఇందుకు జిన్‌పింగ్ స్పందిస్తూ, ఉగ్రవాదంపై పోరాడాలన్న భారత్ దృఢసంకల్పం అభినందనీయమని ప్రశంసించారు. ఆ తర్వాత చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై భారత్ పోరును ప్రశంసించారు. అంతేగాక.. ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధిని మెచ్చుకున్నారు. మున్ముందు కూడా మరింత వృద్ధి సాధించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అయితే సమావేశం అనంతరం ఇరుదేశాధినేతలు కరచాలనం చేసుకొని కాసేపు ముచ్చటించుకున్నారు.

# రాష్ట్రపతికి జులై 23న వీడ్కోలు

ప్రణబ్ ముఖర్జీ.. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ, భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వాలతో కలిసి పనిచేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ప్రణబ్.. గతంలో విదేశీ వ్యవహారాలు, రక్షణ, ఆర్థిక మంత్రిగా పనిచేశారు. జులై 24న రాష్ట్రపతిగా ఆయన పదవీకాలం పూర్తవనుంది. ఈ నేపథ్యంలో అంతకు ఒకరోజు ముందుగా జులై 23న రాష్ట్రపతికి వీడ్కోలు ఇవ్వనున్నారు.

రాష్ట్రపతి పదవీకాలం పూర్తవడంతో తదుపరి రాష్ట్రపతి ఎంపిక కోసం ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ఖరారు చేసింది. కాగా.. రాష్ట్రపతి ఎన్నికకు అధికార పక్షం నుంచి బిహార్ మాజీ గవర్నర్ రామ్‌నాథ్ కోవింద్, ప్రతిపక్షాల నుంచి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకూమార్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. జులై 17న రాష్ట్రపతి ఎన్నికలు జరగనున్నాయి. జులై 20న ఫలితాలు విడుదల చేయనున్నారు.

# చట్టప్రకారమే లాలూపై సీబీఐ దాడులు

రాంచిలోని రైల్వేస్‌లో హోటళ్లు నడుపుకొనేందుకు ప్రైవేటు వ్యక్తులకు లాలూ అక్రమంగా టెండర్లు కేటాయించినట్లు సీబీఐ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇందుకుగానూ.. సదరు వ్యక్తులు లాలూ కుటుంబానికి రెండు ఎకరాల స్థలాన్ని రాసిచ్చినట్లు పేర్కొంది. ఈ మేరకు ఆరోపణలు రావడంతో దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. లాలూ కుటుంబానికి చెందిన 12 ప్రాంతాల్లో సోదాలు చేసింది. దిల్లీ, పట్నా, రాంచీ, పూరి, గుడ్‌గావ్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది.

ఈ వ్యవహారంలో లాలూ, ఆయన భార్య రబీదేవి, కుమారుడు, బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, రైల్వే మాజీ ఎండీ పీకే గోయల్, లాలూ అత్యంత సన్నిహితుడు ప్రేమ్‌చంద్ గుప్తా భార్య సరళ గుప్తాపై కేసులు నమోదు చేసినట్లు సీబీఐ వర్గాల సమాచారం.

# సింహచలేశుని గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం

నున్నారు. శనివారం మధ్యా హ్నం రెండుగంటలకు అనువంశిక ధర్మకర్త కేంద్ర మంత్రి పూసపాటి అశోక గజపతి రాజు, తొలి పావంచా వద్ద ప్రచార రథంలో ఉన్నస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దీనితో గిరిప్రదక్షిణ లాంఛనంగా ఆరంభమవుతుంది. రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు,జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యాక్రమానికి హాజరవుతారు.

# సచివాలయంలో మంత్రులు సమావేశం

తరువాత నిర్మించిన ఆసుపత్రులకు తప్పకుండా ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసి అవసరమన్నారు.

20-30 సంవత్సరాలకు ముందు నిర్మించిన ఆసుపత్రుల చుట్టు ఫైర్ ఇంజన్ వెళ్లి తిరగాలంటే కొంత ఇబ్బంది ఉందన్నారు. దీనిపై సీఎం దృష్టికి తీసుకొనివెళ్లి దీనిని రెండు, మూడు క్యాటగిరీలుగా విభజించి తదుపరి సమావేశంలో దీనిపై ఒక నిర్ణయం చెప్తామన్నారు.

చిన్న పాఠశాలలకు ఒక ఫ్లోర్ ఉన్న వాటికి ఎన్‌వోసి అవసరం లేదన్నారు. పెద్ద స్కూల్స్, షాపింగ్ మాల్స్ కు తప్పనిసరిగా ఎన్‌వోసి అవసరమన్నారు.

మరోసారి త్వరలో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశం ఏర్పాటు చేస్తామని, సీఎం దృష్టికి తీసుకొనివెళ్తామని మంత్రి తెలిపారు.

ఈ సమావేశంలో మంత్రులతో పాటు హోంశాఖ ముఖ్య కార్యదర్శి అనురాధ, డిజి ఫైర్ సేఫ్టీ సత్యనారయణ, పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ నాగూల్ మీరా, ఏపీ ఐఎమ్ఏ అధ్యక్షులు డా. గంగాధర రావు మరియు మున్సిపల్ అధికారులు , ఫైర్ సెఫ్టీ అధికారులు , ఐఎమ్ఏ డాక్టర్స్, బిల్డర్స్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## పట్టణ గృహ నిర్మాణ కార్యక్రమంపై సమావేశం నిర్వహించిన కలెక్టర్

నెలల సమయం పట్టేదని, చిత్తశుద్ధితో పనిచేస్తే ఎటువంటి పనినైనా చేయగలరని దీని ద్వారా నిరూపించారని అభినందించారు.

పట్టణ ప్రాంతాల్లో నివేశన స్థలాల లభ్యత తక్కువగా ఉన్నందున విలేజ్ మ్యాప్ లు, ఆర్.వో.ఆర్ తో పాటు సర్వేయర్లు,వి.ఆర్.ఒలను ప్రక్కన పెట్టుకొని ఖాళీ స్థలాలు గుర్తించాలని చెప్పారు. అనంతపురంలో తాము ఈ విధంగా చేస్తే సుమారు 176 ఎకరాల మేరకు స్థలం గుర్తించగలిగామన్నారు. స్థలం ఉంటే ఎంత మందికైనా ఇళ్ళు కట్టించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మరో ఐదేళ్ళలో ప్రతి కుటుంబానికి సొంత ఇంటిని నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కలెక్టరు అనుమతి లేకుండా తహశీల్దార్లు ఎక్కడ ఇళ్ళ స్థలాలు మంజూరు చేయడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టం చేసారు. భూమి వివరాలు, లబ్దిదారుల వివరాలతో ప్రతిపాదనలు పంపి ఆమోదం పొందిన తరువాతనే మంజూరు చేయాలన్నారు. లబ్దిదారుల జాబితాలన్ని యం.పి.హెచ్ సర్వేలో అప్ డేట్ చేయాలని తహశీల్దార్లను కలెక్టరు ఆదేశించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి క్రితికా శుక్లా, పురపాలక శాఖ ప్రాంతీయ సంచాలకులు శ్రీమతి సి.హెచ్. అనురాధ, జిల్లా రెవిన్యు అధికారి శ్రీ కె. నాగబాబు, ఎ.పి. టిడ్కో సుపరింతెండెంట్ ఇంజనీరు శ్రీ కోటేశ్వరరావు, జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ నాగేశ్వరరావు, గుంటూరు, తెనాలి, నరసరావుపేట ఆర్.డి.ఒ లు శ్రీ శ్రీనివాసరావు, శ్రీ నరసింహులు, శ్రీ రవీంద్ర, వివిధ మున్సిపాలిటిల కమీషనర్లు, తహశీల్దారు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ త్రోబాల్ పోటీలకు ఎంపిక

సిరుగుప్ప : మలేసియాలో ఆగస్టు 28 నుంచి 30 వరకు జరగనున్న అంతర్జాతీయ త్రోబాల్ క్లబ్ ఛాంపియన్‌షిప్-2017 పోటీలకు కె.గీతాంజలి అనే విద్యార్థిని ఎంపికైంది. సిరుగుప్ప కళాశాలలో కురుబర సంఘం ఆధ్వర్యంలో ఆమెను సత్కరించారు. సిరుగుప్ప బి.ఇ.హనుమంతమ్మ స్మారక సాంకేతిక శిక్షణ సంస్థలో గీతాంజలి త్రోబాల్‌లో రాణిస్తూ అంతర్జాతీయ త్రోబాల్ క్లబ్ ఛాంపియన్‌షిప్‌ల-2017 పోటీలకు ఎంపికైంది. గీతాంజలి మాట్లాడుతూ అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో రాణించడానికి మెరుగైన శిక్షణ, కఠోరశ్రమ అవసరమన్నారు. బెంగళూరులో శిక్షణ పొందడానికి పెద్దమొత్తంలో ఖర్చువుతుంది. పోటీల్లో విజేతగా నిలిచి బళ్లారి జిల్లాకు కీర్తిప్రతిష్టలు తెస్తానన్నారు. పోలీస్ సిబ్బంది వసతి గృహంలో గురువారం కురుబర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో గీతాంజలిని సన్మానించారు. కానిస్టేబుల్ కుమారస్వామి కుమార్తె అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని పలువురు కొనియాడారు.

# పవన విద్యుత్తు కొనుగోలుకు చర్యలు

విల్లివాక్కం : పవన విద్యుత్తు కొనుగోలు చేయడానికి విద్యున్మండలి చర్యలు తీసుకుంటోంది. దీనికి సంబంధించి ఏర్పాటు చేసిన సలహా సమావేశం నిర్వహించింది. ఇందులో వూహించని విధంగా 25 మంది పెట్టుబడిదారులు పాల్గొన్నారు. తమిళనాడు విద్యున్మండలి మొదటి సారిగా యూనిట్ గరిష' ధరను రూ. 3.46గా నిర్ణయించి 'టెండరు' ద్వారా 500 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు చేయనుంది. ఇందుకుగాను టెండరులో పాల్గొనడానికి ఈనెల 18వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుల సందేహాలను తీర్చడానికి చెన్నైలోని విద్యు న్మండలి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి చక్కని స్పందన లభించింది. పవన విద్యుత్తు కొనుగోలుకు ప్రస్తుతం విద్యుత్తు క్రమబద్ధీకరణ కమిషనరేట్ యూనిట్ ధర రూ. 4.16గా నిర్ణయించినట్టు మండలి అధికారి ఒకరు తెలిపారు. కేంద్రం నుంచి యూనిట్ విద్యుత్తును రూ. 3.46 చొప్పున కొనుగోలు చేయడానికి అనుమతి వచ్చిందన్నారు. ఈ మేరకు 500 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు చేస్తామని చెప్పారు. దీనికి సంబంధించిన సందేహాలకు తీర్చడానికి ఏర్పాటు చేసిన సమావేశంలో 25 సంస్థల ప్రతినిధులు పాల్గొ న్నారని హర్షం వ్యక్తం చేశారు. వూహించినదాని కంటే ఈ సంఖ్య అధికమన్నారు. పాల్గొన్న కొన్ని సంస్థలు కొనుగోలు ధర పెంచాలని డిమాండ్ చేశాయని చెప్పారు. ఆ వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

# ప్రకృతి సేద్యంపై ఉచిత శిక్షణ

విల్లివాక్కం : ప్రకృతి సేద్యం చేయడంపై అమెరికా స్వఛసేద సంస్థ సహకారంతో రాష్ట్రంలోని రైతులకు శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కరవు తాండవిస్తున్న కారణంగా వ్యవసాయం దెబ్బతింది. అన్నదాతల జీవనాధారం ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రకృతి సాగు ద్వారా ఖర్చు లేకుండా, రసాయన రహిత ఆహార పదార్థాల ఉత్పత్తికి గాను కాంగేయం పశువుల పరిశోధనా కేంద్రంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు అమెరికాలోని ప్రవాస భారతీయులు సాయం అందిస్తున్నారు. పరిశోధన కేంద్ర చీఫ్ కార్తికేయ శివసేనాధిపతి మాట్లాడుతూ... తిరుప్పూరు జిల్లా కుట్టపాలయంలో పశు సంపద అభివ ృద్ధికి తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం అమెరికాలోని ప్రవాస భారతీయల సహకారంతో ప్రస్తుత శిక్షణ కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. కరవు వల్ల ఇబ్బంది పడుతున్న రైతు కుటుంబాలను గుర్తించి... ప్రకృతి సేద్యం చేయడానికి అవసరమైన తర్ఫీదును ఉచితంగా ఇస్తున్నామని వెల్లడించారు. కరవు రక్కసి కోరలలో చిక్కుకుని కుటుంబ పెద్దను కోల్పోయిన పలు కుటుంబాలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. అలాంటి కుటుంబాలలోని పిల్లలు విద్య కొనసాగడానికి ఏడాదికి అయ్యే ఖర్చును అమెరికాలోని స్వచ్ఛంద సంస్థ భరిస్తుందని తెలిపారు. ఇంత వరకు తంజావూరు, తిరువారూరు, నాగపట్నం, తిరువణా?మలై, పుదుక్కోట్టై, నామక్కల్, ఈరోడ్ జిల్లాలకు చెందిన 58 మంది రైతులకు ప్రక ృతి సేద్యంపై శిక్షణ ఇచ్చినట్టు గుర్తు చేశారు. శిక్షణ కొనసాగు తుందని పేర్కొన్నారు.

## బెంగళూరులో

# సబర్బన్ సేవలు అత్యసవరం

బెంగళూరు : నగరంలో వాహన రద్దీ సమస్యను నివారించేందుకు రైలు (సబర్బన్) సదుపాయాలు అత్యవసరమని బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి కె.జె.జార్జ్ తెలిపారు. నగరంలోని రైలు మార్గాలకు అనుబంధంగా సిటీ రైళ్లను నడిపేందుకు అవకాశం ఇవ్వాలని తాము కేంద్ర రైల్వే మంత్రి సురేష్ ప్రభును త్వరలో కలిసి చర్చిస్తామని వెల్లడించారు. కేంద్ర మంత్రి సదానందగౌడ, లోక్‌సభ సభ్యుడు పి.సి.మోహన్, బీఎంఆర్‌సీఎల్ మేనేజింగ్ డ్కెరక్టర్ ప్రదీప్‌సింగ్ కరోలా, నైరుతి రైల్వే డివిజనల్ మేనేజర్ ఎ.కె.గుప్త తదితరులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. సుమారు గంట పాటు సుదీర్ఘ చర్చల తరువాత ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని పార్టీల నాయకులతో కలిసి సురేష్‌ప్రభును రెండు, మూడు వారాల్లో కలుస్తామని చెప్పారు. విద్యుదీకరణ ఉన్న ప్రధాన రైల్వే లైన్‌లో మొదట 15 రైళ్లను నడుపుతూ, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సంఖ్యను పెంచడం, అదనపు మార్గాల ఏర్పాటు చేసుకోవటం చేస్తామన్నారు. మెజెస్టిక్‌లోని ప్రధాన రైల్వేస్టేషన్ నుంచి దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయం వరకు (దేవనహళ్లి), యశ్వంతపుర నుంచి దేవనహళ్లికి ప్రత్యేక రైలు మార్గాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని చర్చించామని తెలిపారు.

కెంగేరి, నెలమంగళ, యలహంక, హెూసూరు, వైట్‌ఫీల్డ్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రైలుమార్గాల్లోనే సిటీ రైళ్లను నడపటం ద్వారా నగరంలో వాహన రద్దీ సమస్య సగానికి పైగా తగ్గిపోతుందని వివరించారు.

# 'ఓటర్ల నమోదు ప్రక్రియ' ప్రారంభం



కోయంబత్తూరు : ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు శిబిరం నిర్మల ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగింది. ఇందులో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జిల్లా అదనపు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి దురై రవిచంద్రన్ ప్రారంభించారు.

నూతన ఓటర్ల పేర్ల నమోదు, అనర్హుల పేర్లను తొల గించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని ఆయన పేర్కొన్నారు. జులై ఒకటి నుంచి నెలాఖరు వరకు ఈ పనులు కొన సాగుతాయని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఫారా లను పూర్తి చేసిన తర్వాత కార్యాలయంలో 31వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్, ఇ-సేవా కేంద్రాల నుంచి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ప్రత్యేక శిబిరాలు ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టరు కార్యాలయానికి చెందిన అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటర్ (ఎన్నికలు) రాజ్‌కుమార్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్లు రవికుమార్, అన్నాదురై తదితరులు పాల్గొన్నారు.

# అధ్యాపకుల ఉద్యమ బాట

బెంగళూరు : కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం తక్షణమే చర్యల్ని తీసుకోవాలని డిమాండు చేస్తూ జూనియర్ లెక్చరర్లు, ఒప్పంద పద్ధతిలో సేవల్ని అందిస్తున్న ఇదే స్థాయి ఉద్యోగులు డిమాండు చేశారు. మాధ్యమిక విద్యను బోధించే కళాశాలల్లో 2160 ఉద్యోగాల భర్తీకి 2015లో ఉత్తర్వులు జారీ చేసి, అదే ఏడాది పరీక్షలను నిర్వహించినా ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగాన్నీ భర్తీ చేయలేదని జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు యోగేష్ ఆక్రోశించారు. బెంగళూరు స్వతంత్ర ఉద్యానంలో గురువారం నిర్వహించిన ధర్నాకు ఆయన నేతృత్వం వహించి మాట్లాడారు. రెండున్నరేళ్లుగా పోస్టుల భర్తీ చేయటంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించటంతో పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల్లో పలువురి వయసు మీరి ఉద్యోగ అవకాశాలను కోల్పో యారని ఆక్రోశించారు.

ప్రభుత్వం తక్షణమే తమ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని పోస్టులు భర్తీ చేయకపోతే తాము ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

# బాలమురళీకృష్ణ కారణజన్ములు

## సంగీత దర్శకుడు ఇళయరాజా

చెన్నై : ప్రముఖ సంగీత విద్వాంసులు బాలమురళీకృష్ణ కారణజన్ములని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా పేర్కొన్నారు. బాలమురళీకృష్ణ జయంతోత్సవాలను పురస్కరించుకొని నగరంలో ఓ కార్యక్రమం జరిగింది. సంగీత ప్రపంచానికి ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఆయన సేవలను కొనసాగించే దిశగా కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన స్మారక ట్రస్టును ఇళయారాజా ప్రారంభించారు.

# బయోమాస్ ప్లాంట్లపై ప్రభుత్వ నిర్ణయం దారుణం

- పనిభద్రత కల్పించాలని కార్మికుల ధర్నా
-ఎస్ఎల్ఎస్ పవర్ ప్లాంటు ఎదుట నిరసన

నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం బయోమాస్ విద్యుదుత్పత్తి ప్లాంట్లపై తీసుకున్న నిర్ణయం దారుణమైందని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడతల రమేష్ తెలిపారు. నెల్లూరు నవలాకులతోట ప్రాంతంలోని అశోక్‌నగర్‌లో ఉన్న ఎస్ఎల్ఎస్ పవర్ ప్లాంట్ వద్ద పని కోల్పోయిన ఉద్యోగులు, కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 33 బయోమాస్ విద్యుదుత్పత్తి ప్లాంట్ల నుంచి విద్యుత్తు కొనుగోలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వందలాది మంది ఆయా పరిశ్రమల్లోని ఉద్యోగులు, కార్మికులు ఉద్యోగ భద్రత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీపీఏ(పవర్ పర్చేస్ అగ్రిమెంట్)ను పాటించకుండా అర్థాంతరంగా బయోమాస్ విద్యుతు ప్లాంట్ల నుంచి విద్యుత్తును కొనుగోలు చేయమనడం సరిగా లేదన్నారు. అవసరమైతే సంబంధిత ఫ్యాక్టరీలను మూసేయాలని సీఎం చెప్పడం దారుణంగా ఉందన్నారు. ఎస్ఎల్ఎస్ పవర్ ప్లాంటులో దాదాపు 300 మంది వరకు ఉద్యోగులు, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడు తోందన్నారు.

వారికి పనిభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీని లాకౌట్ చేయడంతో అందులో పనిచేస్తున్న వారి పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పవర్ ప్లాంట్స్ ఉద్యోగులు నాగరాజు, మధు, వెంకటేశ్వర్లు, రమేష్, రతనం, బాలకృష్ణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

## వైద్యబిల్లులు అప్‌లోడ్ చేయాలని ఉత్తర్వులు

కడప : ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల వైద్యచికిత్సలకు సంబంధించిన బిల్లులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పంపుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు.

## పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

కోసిగి: గ్రామీణ ఉపాధి హామీ పథకానికి చెందిన పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు లింగన్న అన్నారు. శుక్రవారం ఆ సంఘం నాయకులతో కలిసి తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల్లో గత మూడు నెలలుగా ఉపాధి హామీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీనివల్ల కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించి వారికి పక్కా గృహాలు నిర్మించాలని వారు డిమాండు చేశారు. ఈ ధర్నాలో ఆ సంఘం నాయకులు రాముడు, మల్లిఖార్జున, వీరేశ్‌లు పాల్గొన్నారు.

## రహదారి పనులను పరిశీలించిన ఛైర్‌పర్సన్

ఎమ్మిగనూరు: పట్టణంలోని సున్నంబట్టి, చంద్రాయికొట్టాల కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ సాయిసరస్వతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందరేగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతను విస్మరిస్తే బిల్లులు నిలిపివేస్తామని హెచ్చరించారు. సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు నిబంధనల మేరకు చేయాలని ఆదేశించారు. పనులను గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. సున్నంబట్టి వీధిలో కాలువ పూడిక తీత పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈమె వెంట ఏఈ ఆదినారాయణ రెడ్డి, కౌన్సిలర్ శివశంకర్ తదితరులు ఉన్నారు.

## ఈనెల 31 లోపు రిజిస్ట్రేషన్ చేయాలి

కర్నూలు : 2017-18 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇన్‌స్పైర్ మనార్ పథకంలో విద్యార్థులను భాగస్వాములు చేసేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాధికారి తహెరాసుల్తాన ఒక ప్రకటనలో తెలిపారు. 2016-17లో నమోదు చేసుకోనివారు ఈనెల 31లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ప్రాథమికోన్నతలో 6,7 తరగతుల నుంచి ఇద్దరు, ఉన్నతలో 6-10వ తరగతి నుంచి ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసుకోవాలన్నారు. విద్యార్థి పేరు, తరగతి, ఆధార్ నంబరు, వ్యక్తిగత ఖాతా వివరాలు,ఫొటో, ప్రాజెక్టు పేరు, ప్రాజెక్టు సంక్షిప్త సమాచారం, గైడ్ టీచర్ వివరాలు రిజిస్ట్రేషన్‌లో పొందు పర్చాలన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు

హాలహర్వి: మండల పరిధిలోని సాకిబండ గ్రామంలో వెలసిన శివాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. గత మూడు రోజుల నుంచి పీఠాధిపతి శివాచార్యులు ప్రత్యేక ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రత్యేక ప్రవచనాలను వినేందుకు ఆంధ్రా, కరా?టక ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం పీఠాధిపతులకు భక్తుల విరాళాలతో తులాభారం కార్యక్రమం చేపట్టారు.

## కనులపండువగా వాహనసేవలు



తాళ్లపాక: తాళ్లపాక సిద్ధేశ్వర, చెన్నకేశవస్వామి ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగాస్వామివార్ల వూరేగింపులు వైభవంగా జరిగాయి. తొలుత చిన్నశేష వాహనంపై కామాక్షీదేవి సమేత సిద్ధేశ్వరస్వామి వూరేగింపు పురవీధుల్లో కమనీయంగా సాగింది. అనంతరం చెన్నకేశవస్వామి సింహవాహనంపై వూరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం చెన్నకేశవస్వామి వూంజల్ సేవ కనులపండువగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామివారిని దర్శించుకుని తరించారు. ఈ కార్యక్రమంలో తితిదే అధికారులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో భాగంగా సిద్ధేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం కామాక్షిదేవి సమేత సిద్ధేశ్వరస్వామి గ్రామోత్సవం వైభవంగా సాగింది. చెన్నకేశవస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం మత్స్యాలం కారారంలోని స్వామివారి గ్రామోత్సవం భక్తుల కోలాటం నడుమ కమనీయంగా సాగింది.

భక్తిశ్రద్ధలతో సౌమ్యనాథస్వామికి పల్లకిసేవ-గ్రామోత్సవం

నందలూరు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా సౌమ్యనాథస్వామికి పల్లకిసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగగా అలంకరించారు. అనంతరం ఆలయ మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

# త్యాగాలు చేయండి.. ఫలితాలు రాబట్టండి

## ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఆర్టీసీ ఆర్ఎం



జమ్మలమడుగు : ఆర్టీసీ నష్టాల నుంచి గట్టెక్కాలంటే కార్మికులు త్యాగాలు చేసి మంచి ఫలితాలు రాబట్టాలని ప్రాంతీయ మేనేజర్ చెంగల్‌రెడ్డి సూచించారు. జమ్మలమడుగు ఆర్టీసీ గ్యారేజీలో ఏర్పాటు చేసిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్మికులనుద్దేశించి మాట్లాడారు. మూడు, నాలుగు నెలలుగా ఆర్టీసీ ఆదాయం పెరిగిందన్నారు. రూ.18 కోట్ల మేర నష్టాలుండగా.. రూ.7.50 కోట్లకు తగ్గించ గలిగామన్నారు. ఇదంతా ఆర్టీసీ కార్మికుల సమష్టి కృషితో సాధ్యమైందని పేర్కొన్నారు. ఇటీవలికాలంలో 80 కొత్త బస్సులు రోడ్డెక్కగా, 110 పాత వాటిని నిలిపివేశామన్నారు. లక్ష మంది విద్యార్థులకు ఉచిత బస్సుపాసులు అందించాలనేది లక్ష్యం కాగా.. ఇంతవరకు 33 వేల మందికి ఇచ్చినట్టు పేర్కొన్నారు. మొత్తం 46 వేల మంది దివ్యాంగులను ఇంతవరకు గుర్తించి 8600 మందికి 50 శాతం రాయితీ పాసులను పంపిణీ చేశామన్నారు. డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బస్సును నడిపితే ఆ ఫొటోను తమకు వాట్సాప్ ద్వారా పంపితే రూ.100 బహుమతి ఇస్తామని ప్రకటించారు. జమ్మలమడుగులో ఉన్నది పాత డిపో అని ప్రస్తుతం 70 బస్సులు సేవలు అందిస్తున్నాయని, వాటి సంఖ్య వందకు చేరుకోవాల్సి ఉందని కోరారు. ఈ వేసవిలో తీవ్రమైన ఎండలున్నా గ్యారేజీలోని కార్మికులు బాగా పనిచేశారని ప్రశంసించారు. అందరూ అదే తరహాలో పనిచేసి ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకురావాలని కోరారు. అనంతరం జమ్మలమడుగు డిపోలో బాగా పనిచేసిన కండక్టర్లు, డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు డిపో మేనేజర్ శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ లావణ్య, గ్యారేజీ ఏఎంఎఫ్ వేణుగోపాల్, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు. ఈ చిత్రంలో కన్పిస్తున్నది పత్తి మిల్లులో జిన్నింగ్ అనంతరం రూపుదిద్దుకున్న బేళ్లు. నెల రోజులు అయినా ఇవి అమ్ముడు పోలేదు. దీంతో మిల్లులోనే నిల్వ ఉంచుకున్నారు. గత 20 ఏళ్లకు పైగా ప్రొద్దుటూరు మిల్లుల ద్వారా తయారు చేసిన పత్తి బేళ్లను తమిళనాడు రాష్ట్రానికి పంపిస్తున్నారు. ప్రస్తుతం అంతర్జాలం విధానం కింద విపణిలో పత్తికి రోజుకోధ పలుకుతుండటంతో గిట్టుబాటుకావటంలేదంటూ వ్యాపారులు వాటిని మిల్లుల్లో నిల్వ చేసుకుంటున్నారు. ఇదే సందరేలో రైతులు తెచ్చిన పత్తిని కూడా వ్యాపారులు తీసుకోకుండా వెనక్కు పంపుతున్నారు. ఏడాది కాలంగా స్థానిక జిన్నింగు మిల్లులు మూత పడ్డాయి. ఈ చిత్రంలో కన్పించేవి యంత్రం నుంచి వేరు చేసిన పత్తి విత్తనాలు. ఏడాది క్రితం వీటికి చాలా గిరాకీ ఉండేది. అప్పట్లో కిలో రూ. 28 పలికేది. ప్రస్తుతం క్వింటాలు రూ. 1900 ఇస్తామన్నా ఎవరూ కొనేందుకు ముందుకు రావటంలేదని పత్తి వ్యాపారులు చెబుతున్నారు.

ఈ విత్తనాల ద్వారా నూనెను తయారు చేసి విక్రయిస్తారు. కొనుగోలు చేసేవారు రాకపోవడంతో విత్తనాలు పనికి రావటం లేదని వ్యాపారుల ఆవేదన చెందుతున్నారు.

# డిప్లొమో కోర్సులకు 11న తక్షణ ప్రవేశాలు

కడప : ఇంటర్ వృత్తివిద్యా కోర్సు ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరడానికి స్పాట్‌అడ్మిషన్లు జులై 11న సంబంధిత పాలిటెక్నిక్‌లలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రధానాచార్యులు డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు.

పూర్తి వివరాలకు హెచ్‌టీటీపీ:/ /డీటీఈఏపీ.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు. ఇంటర్ వృత్తివిద్యాకోర్సుతో బ్రిడ్జ్ కోర్సు (ఎంపీసీ) పూర్తిచేసి డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో తమ కళాశాలలో చేరాలనుకునే మహిళా అభ్యర్థులు ఈ నెల 11వ తేదీ ఉదయం 9 గంటలలోపు కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు రెండు జిరాక్స్ సెట్లను, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు.

అభ్యర్థులు కౌన్సెలింగ్ ఫీజు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.150, ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.300 లతోపాటు కోర్సు ఫీజు రూ.3800 కౌన్సెలింగ్‌లో చెల్లించాలని తెలిపారు.

# తాగునీటి సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరు: తమ కాలనీలో బిందెడు నీళ్లు కూడా సరఫరా కావడం లేదని 7వ వార్డు కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి మొరపెట్టుకున్నారు. శుక్రవారం కమిషనర్ 7వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. తాము నీటి పన్నులు చెల్లిస్తున్నా కుళాయిఒల సమస్యలు పట్టించుకోవడం లేదని తెలిపారు. తాగునీటికి అదనపు పైపులైన్ వేయాలని కోరినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వివరించారు.

ఏళ్ల తరబడి సమస్యజటిలమవుతున్నా ఏఈ, డీఈలు ప్రత్యామ్నాయం చూపించడం లేదని కమిషనర్‌కు చెప్పారు. తెదేపా నాయకులు రాందాస్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు బసిరెడ్డి, రవీంద్ర తదితరులు కమిషనర్‌తో పాటు పర్యటనలో పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకే ప్లీనరీ

కడప : రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయటానికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి, వైకాపా ఎమ్మెల్యేలు రవీంద్రనాథరెడ్డి, అంజాద్ బాషా, మేయర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఈ నెల 8న వైకాపా ప్లీనరీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో వారు కడపలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్లీనరీ సమావేశాల్లో అత్యంత ఖరీదైన వంటకాల గురించే ప్రత్యేక చర్చలు చేపట్టారని చెప్పారు. వైకాపా ప్లీనరీ సమావేశాల్లో వంటలకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వబోమన్నారు. అవినీతిలో కూరుకుపోయిన తెదేపా నాయకులు ప్రజాసమస్యలను గాలికి వదిలి అట్టహాసంగా ప్లీనరీ సమావేశాలను నిర్వహించారని చెప్పారు. వైకాపా రాష్ట్ర అధ్యక్షుడు తెదేపా అధినేత ఆలోచనలకు భిన్నంగా ప్రజాసమస్యలకు ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. మండల స్థాయి నుంచి ప్రజల సమస్యలను గుర్తించి వాటిపై నియోజక వర్గాల ప్లీనరీ సమావేశాల్లో తీర్మానాలు చేయించారన్నారు . నియోజకవర్గాల ప్లీనరీ సమావేశాల్లో చేసిన తీర్మానాలను రాష్ట్ర ప్లీనరీ సమావేశాల్లో చర్చిస్తారని చెప్పారు. ఆ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవటానికి ఏడాదిన్నర కాలం పాటూ పోరాడతామన్నారు. ప్రభుత్వం పరిష్కారం చేయని సమస్యలను ఎన్నికల అనంతరం జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పరిష్కరిస్తారన్నారు. ప్లీనరీ సమావేశాల్లో చేసిన తీర్మానాల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. రాష్ట్రపతి అభ్యర్థి కోవింద్‌కు జగన్ పాదాభివందన చేయటాన్ని తెదేపా నాయకులు విమర్శించటం పట్ల వైకాపా నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలికి ఎన్నికై దొడ్డిదారిని మంత్రిపదవి చేపట్టిన లోకేష్ గవర్నర్ నరసింహన్‌కు పాదాభివందనం చేయటాన్ని ఏమనుకోవాలని ప్రశ్నించారు. వైకాపా నాయకులంతా ఈ సమావేశానికి తరలిరావలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఎంపీ సురేష్, చల్లారాజశేఖర్, సంబటూర్ ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పశుగ్రాసం క్షేత్రాలు ఏర్పాటుకు నిర్ణయం : జేడీ

నెల్లూరు : జిల్లాలో పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వూరూరా ఐదు ఎకరాల్లో పశుగ్రాసం క్షేత్రాలు అభివృద్ధి చేసేందుకు సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారులు, పశువైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పశుసంవర్థకశాఖ జేడీ శ్రీధర్ కుమార్ పేర్కొన్నారు. నెల్లూరు నగరం రైల్వేఫీడర్స్‌రోడ్డులోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన జిల్లాలోని పశువైద్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాడికి ఆధారమైన పచ్చి మేత జిల్లాలో పెంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఔత్సాహిక రైతుల నుంచి ఐదు ఎకరాల భూమిని లీజుకు తీసుకుని ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలన్నారు. పాడి రైతులకు కేజీ గడ్డి ఒక్క రూపాయికి అందిస్తామన్నారు. 25 నుంచి 30 కేజీల గడ్డిని ఈ పశువులు తింటే 6 నుంచి 8 లీటర్ల పాలు ఇస్తాయన్నారు. ఆ భూమి లీజు వ్యవహారాన్ని ఆయా తహసీల్దారుతో కూడిన జిల్లా కమిటీ ఆమోదిస్తుందన్నారు. ఐదు ఎకరాల్లో రైతు ఉపాధి హామీ పథకం కింద గడ్డి పండించుకుంటారని చెప్పారు. ఒక ఎకరాకు రైతు 8,000 కేజీల గడ్డిని ఉత్పత్తి చేస్తే వారికి నెలకు రూ. 8,000 ఆదాయం వస్తుందన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వైద్యులు వారి సమస్యలను జేడీకి వివరించారు. సమావేశంలో ఆ శాఖ ఏడీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులు ఉండకూడదు: ఎస్పీ

సింహాద్రిపురం : ప్రజలకు పోలీసులు రక్షణగా ఉండాలని జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ అన్నారు. ఆయన ఆకస్మికంగా స్థానిక పోలీసుస్టేషన్ తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసుల వివరాలను ఎస్ఐ సంజీవరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి కేసులూ పెండింగులో ఉండకుండా చూడాలన్నారు. అలాగే పలు కేసులకు సంబంధించిన రికార్డులను ఆయన తనిఖీచేశారు. అనంతరం సీఐ రవిబాబుతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ముచ్చుమర్రి, కసనూరు, తిమ్మాపురం, హిమకుంట్ల, బిదినంచెర్ల, దిద్దేకుంట గ్రామాల్లో ఫ్యాక్షన్ సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక స్టేషన్ పరిధిలో పెంచుతున్న మొక్కలను టార్చ్‌లైట్ వెలుతురులో పరిశీలించారు. పోలీసులకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మట్కా, పేకాట, క్రికెట్‌బెట్టింగులపై పూర్తి నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

## మద్యం దుకాణం వద్దు

కోసిగి: కోసిగిలోని ప్రధాన రహదారి పక్కన మద్యం దుకాణం వద్దని సిద్దప్పపాలెం వీధికి చెందిన మహిళలు వీరమ్మ, చిట్టెమ్మలు అన్నారు. శుక్రవారం ఆ వీధి మహిళలందరూ కలిసి పాతమద్యం దుకాణం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం స్థానిక ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల వీధుల్లో మద్యం మత్తులో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారన్నారు. వీరి వల్ల మహిళలు ఇబ్బందులు ఎదర్కోవల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ ఆదినారాయణకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బడికి, గుడికి 100 మీటర్ల లోపు మద్యం దుకాణం ఉండకూడదని తెలిపారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వల్ల ఎటువంటి సమస్య రాదని పేర్కొన్నారు. గతంలో కూడా ఇక్కడ మద్యం దుకాణం ఉందని దీనివల్ల ఎటువంటి సమస్య రాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## అడుగంటిన జలాశయాలు

హాలహర్వి: మండల పరిధిలోని బాపురం గ్రామంలో ఉన్న జలాశయం నీరు లేక అడుగంటి పోయింది. దీంతో ఈ జలాశయం నుంచి సుమారు 26 గ్రామాలకు సక్రమంగా తాగునీరు సరఫరా జరగడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో తీవ్ర నీటిఎద్దడి కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూరప్రాంతాలకు వెళ్లి నీటికుంటలు, బోరుబావుల నుంచి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టాల్సి ఉన్నా అధికారులు దృష్టి సారించకపోవడంతో సమస్య పెరిగింది. దీనిపై తక్షణమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని వారు అధికారులను కోరారు.

## పాఠశాలలో స్వచ్ఛభారత్

గోనెగండ్ల: గోనెగండ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఉపసర్పంచి రవికుమార్‌నాయుడు శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందరేగా వారు పాఠశాల పరిసరాల్లో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించారు. అనంతరం చీపుర్లతో పాఠశాల పరిసరాల్లోని చెత్తను వూడ్చి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు ఆనంద్, దాదాసాహెబ్, సురేష్, నవీన్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లపట్టాలు ఇవ్వాలంటూ ర్యాలీ

కర్నూలు : నందికొట్కూరు మున్సిపాలటీలోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డినగర్‌లో నివసించే అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరుతూ కర్నూలు జిల్లా వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కేవీ నారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాజ్‌విహారి కూడలి నుంచి పాతబస్టాండ్‌లోని ఆర్డీవో కార్యాలయం వరకుఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందరేగా ఆయన మట్లాడుతూ.. అలాగే తాండ్రపాడు గ్రామంలోని ప్రజల్లో అర్హులైన వారికి కూడా ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు సోమన్న, లాజరస్, వి.వెంకటేశ్వర్లు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## నూతన స్టాంపులు విడుదల

కర్నూలు : స్థానిక కర్నూలు ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టల్ ప్రధాన పర్యవేక్షకుడు కేవీ సుబ్బారావు చేతుల మీదుగా పలు విశ్వవిద్యాలయాల లోగోలతో కూడిన స్టాంపులను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని పలు విశ్వవిద్యాలయాల ఔన్నత్యాన్ని తెలిపేలా స్టాంపులు విడుదల చేశామని ఇవి జిల్లాలోని తపాలాశాఖ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్టుమాస్టర్ ఏ.డేవిడ్, సహాయక పర్యవేక్షకుడు నాగనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు వివిధ రకాల పంటలు సాగుచేయాలి

ఎమ్మిగనూరు : రైతులు తమకున్న విస్తీర్ణంలో ఒకే పంటను కాకుండా వివిధ రకాల పంటలను సాగు చేసుకోవాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ స్థానం ఏడీఆర్ గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బనవాసిఫారం కృషీ విజ్ఞాన కేంద్రంలో ఖరీఫ్ సాగుపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంపై మాత్రమే ఆధారపడకుండా అనుబంధ రంగాలైన పాడి, కోళ్ల పెంపకం వంటివి చేపట్టడం వల్ల ఏడాది పొడవునా ఆదాయం ఉంటుందన్నారు. రైతులు విత్తులోనే భాస్వరం ఎరువులు వేసుకోవాలని సూచించారు.

# విజయభాను

## సంపాదకీయం

## బాధ్యత పెద్ద దేశాలదే

ఆయుధ పోటీ పెరుగడానికి పెద్ద దేశాల వైఖరే కారణం. అమెరికా, రష్యాల ఆయుధ సంపత్తిని చూసి చైనా తనను తాను బలోపేతం చేసుకుంటున్నది. చైనా ఆయుధ పాటవానికి దీటుగా భారత్ జాగ్రత్తలు తీసుకుంటుంది. ఇట్లా పెద్ద దేశాల మధ్య మొదలైన ఆయుధ పోటీ వల్ల ఇతర దేశాలు అనివార్యంగా అణ్వస్త్రాలను తయారు చేసుకోకతప్పడం లేదు. దీనికి అంతూపొంతూ ఉండదు. అందువల్ల నిరాయుధీకరణ పెద్ద దేశాల నుంచి మొదలు కావాలె. పెద్ద దేశాలు అంతకంతకూ అత్యాధునికఆయుధాలు పెంచుకుంటూ, ఇతర దేశాలకు నీతులు చెప్పడంవల్ల ఫలితం ఉండదు.

ఖండాంతర క్షిపణిని పరీక్షించినట్టు ఉత్తర కొరియా ప్రకటించడం మళ్ళా ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయనే ఆందోళన కలుగుతున్నది. ఇప్పటికే అణ్వస్త్ర ప్రయోగాలు చేసిన ఉత్తర కొరియా తమ క్షిపణి వ్యవస్థను అంతకంతకూ పెంచుకుంటూ పోతున్నది. అమెరికా కూడా ఉత్తర కొరియా ఖండాంతర క్షిపణిని పరీక్షించినట్టు ధ్రువీకరించింది. అయితే ఉత్తర కొరియా క్షిపణికి బిగించే స్థాయిలో అణ్వస్త్రాన్ని తయారు చేసుకున్నదా అనే అనుమానం మాత్రం ఇంకా ఉన్నది. ఉత్తర కొరియా మాత్రం తాము వ్యూహాత్మక ఆయుధ పాటవాన్ని పూర్తిగా సంతరించుకున్నట్టు ప్రకటించింది. పరిణతి చెందిన రాజకీయ వ్యవస్థలేని ఉత్తర కొరియా వంటి చిన్న దేశం అణ్వస్త్ర దేశంగా మారడం ప్రమాదకరమే. అయితే ఇందుకు ఆ ఒక్క దేశాన్ని నిందించి ఫలితం లేదు. పొరుగునే ఉన్న చైనా సహాయం లేకుండా ఉత్తర కొరియా అణ్వస్త్రాలను, ఖండాంతర క్షిపణులను పరీక్షించడం అయ్యేపని కాదు. అందుకే ఉత్తర కొరియా క్షిపణి పరీక్ష వార్త వెలువడిన వెంటనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాను దుయ్యబట్టారు. ఉత్తరకొరియాపై చైనా ఒత్తిడి తేవడం లేదనేది ట్రంప్ ఆరోపణ. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో ఉత్తర కొరియాతో చైనా వాణిజ్యం నలభై శాతం పెరిగిందని ట్రంప్ ఆరోపించారు. కానీ చైనా మాత్రం ఉత్తర కొరియాపై ఆంక్షలను అమలు చేస్తున్నట్టు చెబుతున్నది. ట్రంప్ అధికారానికి వచ్చిన నాటి నుంచి చైనాపై ఒత్తిడి తేవడం, ఉత్తర కొరియాను బెదిరించడం అనే ద్విముఖ వ్యూహం అనుసరించారు, కానీ ఫలితం ఇవ్వలేదు. ఉత్తర కొరియా ఆయుధ పాటవం ప్రపంచానికి ప్రమాదం కనుక, ఇప్పుడు ప్రపంచమంతా ఏకమై ఉత్తర కొరియాను కట్టడి చేయాలని ట్రంప్ పిలుపునిస్తున్నారు.

ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా, సోవియెట్ యూనియన్ భారీగా అణ్వస్త్రాలు సమకూర్చుకోవడంతో ఒకరిపై మరొకరు దాడి చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిందని అనిపించినా, ఇంకా కొనసాగుతూనే ఉన్నది. అఫ్ఘానిస్థాన్‌లోని సోవియెట్ అనుకూల ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాలిబన్లను సృష్టించడం కూడా ఇటువంటిదే. దక్షిణ కొరియాలో అమెరికా సైనిక స్థావరం ఉన్నది. సమీపంలోనే జపాన్ ఉన్నది. కొంచెం దూరంగా ఆస్ట్రేలియా ఉన్నది. దక్షిణ చైనా సముద్రంలోని చిన్న దేశాలను అమెరికా రెచ్చగొడుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలో చైనా కూడా ఉత్తర కొరియాను బలోపేతంగా చేసి సవాలు చేస్తున్నది. ఇక్క డ ఏ ఒక్క పక్షానిది తప్పు లేదా ఒప్పని కాదు. రెండు పక్షాలూ ఉత్తర, దక్షిణ కొరియాలను పావులుగా వాడుకుంటున్నాయి. అమెరికా, చైనా ఒక్క ఉత్తర కొరియాపైనే కాకుండా తూర్పు ఆసియాలో ఉద్రిక్తతను తగ్గించడానికి ఒక అవగాహన కు వస్తే తప్ప కొరియా సమస్య పరిష్కారం కాదు.

అమెరికా, చైనా వంటి పెద్ద దేశాలు కొరియా సమస్యకే పరిమితం కాకుండా, ప్రపంచమంతటా అణ్వస్త్రవ్యాప్తి, నిరాయుధీకరణపై కూడా చర్చలు జరుపడం అవసరం. ఒక్క ఉత్తర కొరియా మాత్రమే కాదు, అనేక దేశాలు అణ్వస్త్ర పాటవం కోసం ప్రయత్నిస్తున్న కాలమిది. శత్రు దాడి ఎప్పుడు ఏ రూపంలో సాగుతుందో తెలువనప్పుడు, అంతర్జాతీయ వ్యవస్థలో ఒక పద్ధతి అంటూ లేనప్పుడు, ఏ దేశమైనా భద్రతారాహిత్యంతో ఆయుధ సంపత్తిని సమకూర్చుకుంటుంది. ఎంత చిన్నదేశానికైనా భద్రత ఉంటుందనే పూచీ ఉన్నప్పుడు, ఆయుధ పోటీ తగ్గుతుంది. అందువల్ల ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వేదికలను బలోపేతం చేసి, చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవడాన్ని ప్రోత్సహించాలె. ప్రపంచమంతా అణ్వాయుధాలు పేరుకుపోయి ఉన్నాయి. ఏ చిన్న ఘర్షణ జరిగినా అది భారీ యుద్ధంగా పరిణమించవచ్చు. అణుయుద్ధంగా మారి మానవాళి మనుగడకే ముప్పు ఏర్పడవచ్చు. ఈ మారణహోమాన్ని నిరోధించవలసిన బాధ్యత పెద్ద దేశాలదే.

## ఎంపీ రూపా గంగూలీని అడ్డుకున్న పోలీసులు



కోల్‌కతా: బీజేపీ ఎంపీ రూపా గంగూలీతో పాటు పలువురు బీజేపీ నేతలను పోలీసులు శుక్రవారం కోల్‌కతా విమానాశ్రయం సమీపంలో అడ్డుకున్నారు. పశ్చిమ్‌బంగాలోని బసిర్‌హత్ ప్రాంతంలో చెలరేగిన మతఘర్షణల్లో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘర్షణల్లో గాయపడిన వారిని పరామర్శించేందుకు వెళుతున్న ఎంపీ రూపా గంగూలీతో పాటు ఇతరులను పోలీసులు మధ్యలోనే అదుపులోకి తీసుకున్నారు.

పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉన్నందున శాంతిభద్రతల దృష్ట్యా బసిరహత్‌లో పర్యటనకు ఎవరినీ అనుమతించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. బసిరహత్ వెళ్లే మార్గంలో బారికేడ్‌లు ఏర్పాటు చేసి, గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. అయితే పరిస్థితి సద్దుమణిగే వరకూ అక్కడకు ఏ రాజకీయ నేతలు పర్యటించవద్దని, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా తమ పార్టీ నేతలు కూడా అక్కడ పర్యటించలేదని తెలిపారు. కాగా బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో చెలరేగిన హింస ఆగడం లేదు. బదూరియలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఓ యువకుడు ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్ట్‌పై చెలరేగిన వివాదం అంతకంతకూ పెరిగిపోయి రెండువర్గాల మధ్య ఘర్షణకు దారి తీశాయి. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. భవనాలపై దాడులకు దిగారు. వాహనాలకు నిప్పుపెట్టారు. ఇరు వర్గాల ఘర్షణలతో బదూరియా రణరంగంగా మారింది.

మంగళవారం నాటికి అల్లరు బదురియా, హరోరా, స్వరూప్‌నగర్, దిగంగ ప్రాంతాలకు వ్యాపించాయి. అయితే పుకార్లు వ్యాపించడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. మరోవైపు శాంతి భద్రతలను అదుపులోకి తెచ్చేందుకు భారీగా భద్రత బలగాలు భారీగా మోహరించాయి. నాలుగు కంపెనీల పారామిలటరీ బలగాలను రంగంలోకి దించారు. అటు బదూరియా అల్లర్లపై కేంద్ర హోంశాఖ ఆరా తీసింది. ఎప్పటికప్పుడు వివరాలను అడిగి తెలుసుకుంటోంది.

## తిరిగి ప్రారంభమైన బెంగళూరు మెట్రో సర్వీసులు



బెంగళూరు : బెంగళూరు నగరంలో మెట్రో రైలు సర్వీసులు నిలిచిపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అయితే మెట్రో ఉద్యోగులతో ఉన్నతాధికారులు జరిపిన చర్చలు సఫలమవడంతో తిరిగి సర్వీసులు ప్రారంభమయ్యాయి. తోటి సిబ్బంది అరెస్టుకు నిరసనగా మెట్రో ఉద్యోగులు ఆందోళనకు దిగడంతో ఈ ఉదయం 5 గంటల నుంచి మెట్రో రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

మెట్రో స్టేషన్ల వద్ద భద్రత కోసం నియమించిన పోలీసులు తమ సిబ్బందిపై దాడికి దిగారని మెట్రో ఉద్యోగులు ఆరోపించారు. ఎదురుదా డులకు దిగిన తమ సిబ్బందిలో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారని.. వారిలో నలుగురిని విడుదల చేయగా, మిగతా ఇద్దరిని వదిలిపెట్టాలని డిమాండ్ చేస్తూ మెట్రో సిబ్బంది ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించి కర్ణాటక రాష్ట్ర పారిశ్రామిక భద్రతా బలగాలకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

ఆందోళనకు దిగిన మెట్రో సిబ్బందితో ఉన్నతాధికారులు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఉద్యోగులకు న్యాయం చేస్తామంటూ హామీ ఇవ్వడంతో సిబ్బంది తిరిగి విధులకు హాజరయ్యారు.

దీంతో 7 గంటల తర్వాత మెట్రో సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి.మెట్రో రైల్వే స్టేషన్లలోని బోర్డులపై హిందీ భాషను ఉపయోగించడంపై అభ్యంతరం చెబుతూ పలు కన్నడ సంఘాలు ఇటీవల ఆందోళనలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్ని మెట్రో స్టేషన్ల వద్ద పోలీసులు భద్రతను పెంచారు.

## ఆలస్యం ఖరీదు 1బిలియన్ డాలర్లు..

### జెట్ విమానాల ఆర్డర్లను రద్దు చేసుకున్న ఖతార్ ఎయిర్‌లైన్స్

పారిస్ : ఎయిర్‌బస్‌కు చెందిన జెట్ విమానాల కొనుగోలు కోసం చేసిన నాలుగు ఆర్డర్లను ఖతార్ ఎయిర్‌లైన్స్ వెనక్కి తీసుకుంది. డెలివరీలో ఆలస్యం కారణంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. అయితే ఆర్డర్లను వెనక్కితీసుకోవడంతో ఎయిర్‌బస్ సంస్థకు దాదాపు 1.2 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లనుంది.

ఖతార్ విమానయాన సంస్థ నాలుగు ఏ350 జెట్ విమానాల కోసం గతంలో ఎయిర్‌బస్‌కు ఆర్డర్లు ఇచ్చింది. నాలుగు జెట్ విమానాల కోసం మేమిచ్చిన ఆర్డర్లను త్వరగా డెలివరీ చేయాలని కోరాం. అయితే డెలివరీలో ఆలస్యమైంది. ఎలాంటి ఆలస్యానికైనా ఎయిర్‌బస్ సంస్థనే బాధ్యతవహించాలని మేం గతంలోనే చెప్పాం అని ఖతార్ ఎయిర్‌వేస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అక్బర్ అల్‌బకార్ తెలిపారు. పలు సమస్యల కారణంగా వీటి డెలివరీలో ఆలస్యమైనట్లు ఎయిర్‌బస్ ప్రతినిధి తెలిపారు. దీంతో ఇప్పుడు ఆ సంస్థ నాలుగు జెట్ విమానాలను తిరిగి అమ్మాల్సి ఉంటుంది.

## ప్రాణం తీసిన క్రికెట్ బెట్టింగ్

రంగారెడ్డి : హైదరాబాద్‌లో దారుణం జరిగింది. శంకర్‌పల్లిలో క్రికెట్ బెట్టింగ్‌కు మరొకరు బలయ్యారు. సెల్ఫీ తీసుకుని విజయ్ అనే వ్యక్తి సూసైడ్ చేసుకున్నాడు. ఈ ఘటన ఐదు రోజుల క్రితం జరిగింది. వ్యవసాయం పనిచేసే విజయ్ కొద్ది రోజుల క్రితం క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో వ్యవసాయంపై వచ్చిన డబ్బులు, బ్యాంక్‌లో తీసుకున్న రుణాలు, బయట అప్పులు చేసి.. మొత్తం కలిపి క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టాడు. దీంతో చాలా నష్టపోయాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక...ఆత్మహత్యే శరణ్యమని భావించి, వ్యవసాయ పొలంవద్దకు వెళ్లి అక్కడే ఉరి వేసుకున్నాడు. ఉరి వేసుకునే ముందు వీడియో కాల్ రికార్డు చేశాడు. ఎవరూ బెట్టింగ్‌లకు పాల్పడవద్దని, తనలా ఆత్మహత్యలకు పాల్పడవద్దని పేర్కొన్నాడు. పోలీసుల దర్యాప్తులో ఇది వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కవి సమయం

### ఆడపిల్ల

ఆడపిల్ల పుట్టినప్పడే 'మైనస్' అన్న పెదవి విరుపులు
ఇవి ఏమీ తెలియని పసిపాప బోసినవ్వులు
యుక్త వయసు రాగానే మగపిల్లల మధ్యకెళ్ళొద్దని
తల్లి చీవాట్లు
చదివింది చాలులే ఆడపిల్లకు చదువెందుకని
తండ్రి అరుపులు
ఉద్యోగం చేసే ఆడవారి పట్ల
తోటివారి ఆకలిచూపులు
మగమహారాయుడిలా ఉద్యోగం చేస్తుందని
చుట్టుపక్కల వాళ్ళ సూటిపోటు మాటలు
అన్ని రంగాల్లో మగవాళ్ళతో
సమానంగా వున్నా
ఆడవాళ్ళకు తప్పలేదు ఈ బాధలు

...కవితా రచన
వైదా ఈశ్వరరావు
సెల్ నెం:7674942843

## పంచాంగం

మాసం : ఆషాడం; తిథి: పంచమి రా.2.43; విశాఖ ఉ.06-28; వ.ఉ.10-53 ల 12.39.

శనివారం 08-07-2017

**మేషం** : మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథకాలు రూపొందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు.బంధువులను కలుసు కుంటారు. స్త్రీలకు షాపింగ్‌లోనూ, వాహనం నడుపుతున్న పుడు ఏకాగ్రత ముఖ్యం. రావలసిన ధనం వసూలు విషయంలో శ్రమాధి క్యత, ప్రయాస లెదుర్కొంటారు. నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి.

**వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి.

**మిథునం** : స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు.

**కర్కాటకం** :విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితులవుతారు. ప్రముఖులను కలుసు కుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి.

**సింహం** : పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. నిరుద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసుకోలేరు. ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది.

**కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తలపెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు.

**తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది.

**వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు. ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మనస్తత్వం అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. సభలు, సమా వేశాలల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు.

**ధనుస్సు** : ఫ్యాన్సీ, స్టేషనరీ, రసాయన, సుగంధ ద్రవ్య వ్యాపారులకు శుభదాయకం. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. ఆకస్మిక ఫీజులు, బిల్లులు చెల్లిస్తారు. పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. సోదరీ, సోదరులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం.

**మకరం** : ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా సాగుతాయి. మీ సంతానం మొండివైఖరి వల్ల చికాకులు వంటివి ఎదుర్కొంటారు. ఫైనాన్స్ వ్యాపారస్తులకు ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులకు తాత్కాలిక అవకాశం లభిస్తుంది. పెద్దలతో కుటుంబ విషయాలు చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు.

**కుంభం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. కుటుంబ విషయాల్లో స్త్రీలకు పట్టుదల, పంతాలు మంచిది కాదు. ఉద్యోగస్తులకు హోదాతో పాటు బరువు బాధ్యతలు పెరుగుతాయి. ఉపాధ్యాయు లకు పనిభారం అధిక మవుతుంది.

**మీనం** : గృహంలో మార్పులు, చేర్పులు అనుకూలమైన కాలం. బ్యాంకు డిపాజిట్లు, దీర్ఘ కాలిక పెట్టుబడులకు అనుకూలం. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

## అయ్యప్ప చింతనతో...

## సంకీర్తన



### అయ్యప్ప ఎవరు..!

హరిహర సుతుడుగా అయ్యప్ప అవతరించినట్టు చరిత్ర చెపు తుంది. అయితే ఒకప్పటి కాలానికి వెడితే, విష్ణువుని ఆరాధించే వారిని వైష్ణవులని, శివుణ్ణి ఆరాధించేవారిని శైవులని, బ్రహ్మని ఆరాధించే వారంతా బ్రాహ్మణులని వర్గీకరణ జరిగింది. అయితే శృష్టిస్థితిలయ కారకులుగా రూపుదిద్దుకున్న ఆ పరమేశ్వరుని రూపాన్ని , భగవంతుడు ఒక్కడే అనే నిజాన్ని విస్మరించి, ఈ త్రిమూర్తులలో ఎవరు ఎక్కువ అనే తత్వం ఈ మూడు వర్గా ల్లోనూ తలెత్తింది. విష్ణువే ఎక్కువ అని వైష్ణవులు, శివుడే ఎక్కువ అని శైవులు వాదించుకోవడం మొదలు పెట్టి, హత్యలు చేసు కునే స్థితికి చేరుకున్నారు. బ్రాహ్మ ణులు ఇద్దరి మధ్య మీమాంశలో పడి కొందరు వైష్ణవుల్లోను, అత్యధిక శాతం శైవుల్లోను కలిసి పోయారు. శైవుల మధ్య వైష్ణవుల మధ్య విపరీతంగా పెరిగిపోయిన విబేధాల వల్ల రక్తపాతం జరుగుతూ వుండేది. హిందూ సమాజం అస్తవ్యస్థంగా మారింది. చివరికి విష్ణ భక్తులు పెట్టు కునే నామాలు కూడా శైవులు నాకి అవ మానించేవారు. ఆ కోపావేశంలో శైవుల్ని హత్యచేయడానికి విషం కలిపిన నిలువునామాలు పెట్టుకునేవారు. వీరి నామాలు నాకిన శైవులు విప్రపభావంతో మరణించేవారు. ఎవరికి వారు మా మతం గొప్పదంటే, మా మతం గొప్పది అంటూ ఆధిపత్యపోరు నిరంతరం సాగిస్తూవుండటంతో సమాజంలో అశాంతి ప్రబలిపోయింది. సాధారణ ప్రజానీకం కూడా ఎవరు ఏమీటో తెలియని వాతా వరణంలో కుమ్ములాటలకి దిగడం పరిపాటిగా మారింది. చివరికి రాజవంశాల్లో కూడా ఇదమిద్ధంగా సరైన అవగాహన లోపించడంతో రారాజులు, మహారాజులు కూడా ఈ విషయంలో నిర్లిప్తధోరణి పాటించారు. సమైక్యతకి కొందరు ప్రయత్నించినా ఫలితం అంతగా కనిపించలేదు. ఇంతటి అస్థిర పరిస్థితిని అదుపుచేసి, సుస్థిర సమాజస్థాపనకోసం హరిహరులు ఒక్కరే అని చేప్పే నేపథ్యంలో హరిహర సుతుడుగా ఇద్దర్నీ ఏకంచేస్తూ ఉద్భవించినవాడే అయ్యప్ప.

### అయ్యప్ప చరిత్ర

ఏ పురాణేతిహాసాల్లోను మనకి తెలిసినంతవరకూ అయ్యప్ప ప్రస్తావన ఉండదు. అయితే భస్మాసురుని సంహా రించడంకోసం శ్రీహరి జగన్మోహినిగా అవతరించడం, భస్మాసురుడికి వరాన్ని అనుగ్రహించి తన నెత్తిమీదికి తెచ్చుకుని కష్టాల్లో పడిన పరమ శివుణ్ణి రక్షించడం, జగన్మోహినిగా ఉన్న శ్రీహరిని చూసి శివుడు మోహించి కొంతకాలం తనతో దాంపత్యం చేయడం, ఆ దాంపత్య కారణంగా ఒక బాలుడు పుడతాడు. అవతార పరిసమాప్తం అవుతున్న సమయంలో ఆ కుర్రవాణ్ణి శివకేశవులు ఒంటరిగా ఆ అడవిలో విడిచి పెడుతూ,రక్షగా మెడలో ఒక మణిని వేసి ఇద్దరు తమ లోకాలకు వెళ్ళిపోతారు. అక్కడితో ఆ ఇతిహాసం పూర్తవుతుంది. అయితే ఆ ప్రాంతాన్ని పరిపాలించే రాజు వేటకు రాగా ఆ అడవిలో హరిహరులకు పుట్టిన కుర్రవాడు ఒంటరిగా దొరకుతాడు. పిల్లలు లేని ఆ మహారాజు ఆ కుర్రవాణ్ణి దైవప్రసాదంగా భావించి తన రాణి చేతిలో ఉంచి, మణిసహితంగా దొరికిన కారణంచేత మణికంఠుడు అనే నామకరణం చేస్తారు. యుక్తవయసు వచ్చిన మణికంఠుడికి పట్టాభిషేకం చేయాలన్న తలంపుతో అతనిని సంప్రదించగా, అందుకు మణికంఠుడు తాను ధర్మసంస్థాపనకోసమే పుట్టిన కారణంచేత, తన తరువాత ఆ రాజదంపతులకు కలిగిన సంతానానికే పట్టాభిషేకం చేయమని, తాను బ్రహ్మచారిగా అడవికి పోయి తన అవతార కార్యక్రమాన్ని నిర్వహిస్తాననీ చెప్పి, రాజ్యత్యాగం చేసి శబరిగిరిని చేరతాడు.అక్కడి నుంచి హరిహర సుతుడుగా, అయ్యప్పగా, ధర్మశాస్తగా పిలవబడుతూ, అవతార విశేషం పూర్తి అవ్వగానే అదే శబరిగిరి మీద వెలిసి ఇప్పుడు అందరి పూజలూ, సేవలూ అందు కుంటున్నాడు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## గ్రామాలను కరవు రహితంగా మార్చాలి

### పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న

చిత్తూరు : గ్రామాలను కరవు రహితంగా మార్చేందుకు గాను ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు వేగవంతం చేయాలని పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. జిల్లా సచివాలయం నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో దృశ్య, శ్రవణ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేస్తే గ్రామాల్లో కరవు నివారణ సాధ్యమవుతుందని చెప్పారు. నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ.. నీరు-ప్రగతి పనుల్లో వేగం పెంచాలన్నారు. అక్రమాలకు తావులేకుండా పనులు జరిపించాలని ఆదేశించారు. పనుల్లో అక్రమాలకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. పంట సంజీవని, మరుగుదొడ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, ఉద్యాన పంటల విస్తరణ, గ్రామపంచాయతీల్లో వ్యర్థ పదార్థాల నిర్వహణ షెడ్లు, ఎన్టీఆర్ పక్కా గృహాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ రుణాల పంపిణీ పథకాల పురోగతిపై సమీక్షించారు. పథకాల పురోగతిపై ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలన్నారు. అవినీతి ఆరోపణలకు తావులేకుండా పథకాలను అమలు చేయాలన్నారు.

ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ కార్యాలయం నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రంగా ఉంచు కోవాలని ఆదేశించారు. కార్యాలయంలో ప్రజలు వేచి ఉండేందుకు ప్రత్యేక సౌకర్యం కల్పించా లని, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. మండలాల్లో రెండోసారి తనిఖీలకు వచ్చేసరికి పరిస్థితుల్లో మార్పు కన్పించాలని కోరారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంయుక్త పాలనాధికారి-2 చంద్రమౌళి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

## రెండోదశ ఈసెట్ కౌన్సెలింగ్

తిరుపతి : రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల ఏడోతేదీ శుక్రవారం, ఎనిమిదో తేదీ శనివారం తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసెట్ రెండో విడత ధృవపత్రాల పరిశీలన నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఒకటో ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు కౌన్సెలింగ్ రెండురోజుల పాటు ఉంటుందన్నారు. హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ ధృవపత్రాలతోబాటు రెండుసెట్ల జిరాక్స్ తీసుకురావాలన్నారు. కళాశాల మార్పుచేసుకోవాలనే విద్యార్థులకు అందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

## జగ్జీవన్‌రామ్ సేవలు వెలకట్టలేనివి

గుంటూరు : బాబూ జగ్జీవన్‌రామ్ సేవల్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు మక్కెన మల్లికార్జునరావు అన్నారు. రాజీవ్‌గాంధీభవన్‌లో బాబూజగ్జీ వన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మక్కెన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి పాటు పడిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రాం అని, నేటి యువత ఆయన అడుగు జాడల్లో ముందుకు సాగాలన్నారు. ఉడా మాజీ ఛైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు ఆయన చేసిన సేవలు ఎన్నటికి మరువలేనివన్నారు. నేడు ఆయన కుమార్తె మీరాకుమార్ ప్రస్తుత రాష్ట్రపతి అభ్యర్థిగా ఉన్నారన్నారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి నాటిక పోటీలు



జగన్నాథపురం : అల్లూరి జయంతిని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో కాకినాడ సూర్యకళా మందిరంలో మూడురోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు ముగిశాయి. ఆఖరి రోజు సరికొత్త మనుషులు నాటికను ప్రదర్శించారు. నటరాజన్ నృత్య కళామందిర్ కాకినాడ ఆచార్య సత్యప్రసాద్ బృందం ఆధ్వర్యంలో నాటికల ముగింపు వేడుకులను పురస్కరించుని ప్రత్యేక నృత్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఉత్తమ ప్రదర్శనగా చాలిక చాలు పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా చాలిక చాలు నాటిక ప్రథమ బహుమతి సొంతం చేసుకుంది. గోమాలచ్చిమి, తేనె టీగలు కుడతాయి ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నాయి. చాలిక చాలు నాటికకు గానూ గోపరాజు విజయ్ ఉత్తమ దర్శకుడిగా, ఉత్తమ నటుడిగా గోపరాజు రమణ ఎంపికయ్యారు.

ఉత్తమ నటిగా గోమాలచ్చిమిలో వెంకటలక్ష్మి పాత్రధారి అమృతవర్షిణి, ఉత్తమ ద్వితీయ నటిగా సరికొత్త మనుషుల్లో నటించిన సుజాత పాత్రధారి టి.లక్ష్మి ఎంపికయ్యారు. ఉత్తమ రచనగా సి.హెచ్.సాంబశివ రావు (గోమాలచ్చిమి), ఉత్తమ విలన్‌గా తేనెటీగలు కుడతాయిలో రాజు పాత్రధారి అమరేంద్ర, సహాయ నటుడిగా తేనెటీగలు కుడతాయి నాటికలో బి.మోహన్‌రావులను విజేతలుగా ప్రకటించారు. వీరికి బహుమతులను సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. ముగ్గురు న్యాయనిర్ణేతలు కె.మోహన్ రావు(ఏలూరు), ఎం.జనార్దన్ (రాజమహేంద్రవరం), బుర్రా పద్మనాభం(కాకినాడ)లు విజేతలను ప్రకటించారు.

## పార్టీ పరంగా ప్రజలతో మమేకమవుతాం

### – తెదేపా జిల్లా అధ్యక్షుడు బచ్చుల అర్జునుడు



కోనేరుసెంటరు : ప్రజలతో మరింతగా మమేకమయ్యేలా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు అధినేత చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు బచ్చుల అర్జునుడు తెలిపారు. స్థానిక రహదారులు, భవనాల శాఖ అతిథిగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏరాజకీయ పార్టీ చేయలేని విధంగా పార్టీ సంస్థాగత ఎన్నికల పక్రియను క్రమం తప్పకుండా నిర్వహించే సత్తా ఒక్క తెదేపాకే ఉందన్నారు.

ఐవీఆర్ఎస్ సర్వే అనంతరం పార్టీ ఆమోదించిన గ్రామ, మండల, డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శుల పేర్లను వెల్లడించారు. జిల్లాలో మొత్తం 1,188 గ్రామ కమిటీలకు సంబంధించి 1,122 మంది అధ్యక్షులు, 1,100 మంది ప్రధాన కార్యదర్శుల పేర్లను అధిష్టానం ప్రకటించిందన్నారు. మండల, డివిజన్ కమిటీలకు సంబంధించి 142 ప్రాంతాలకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవరనేది నిర్ణయించారని, మిగిలిన గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం కూడా వారం వ్యవధిలో పూర్తవుతుందని తెలిపారు. ప్రస్తుతం బూత్ స్థాయి కన్వీనర్‌తో పాటు ప్రతి వంద మంది ఓటర్లకు ఒక సభ్యుడిని ఎంపిక చేపడతామనీ, నెలాఖరులోపు ఈ ప్రక్రియపూర్తిచేస్తామని చెప్పారు. నూతన కమిటీల బాధ్యులు పదిహేను రోజుల్లోపు ప్రమాణస్వీకారం చేస్తారన్నారు.

ప్రతి నెలా 9వ తేదీన గ్రామ స్థాయిలో, 14న మండల స్థాయి, 18న నియోజకవర్గ స్థాయి, 24న జిలా స్థాయి సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. ఆయా స్థాయిల ద్వారా సమీకరించిన తీర్మానాలు రాష్ట్ర కమిటీ ముందుంచుతారనీ, నూతనంగా ఎన్నికైన వారికి మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాకు సంబంధించిన అధ్యక్ష, కార్యదర్శులకు తణుకులో ఈనెల 17 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని చెప్పారు.

తెదేపా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం ద్వారా 85 శాతం మేర ప్రజామద్దతు కూడగట్టుకుంటామన్న విశ్వాసాన్ని బచ్చుల వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం పనితీరును వివరించేలా సెప్టెంబరు 1వ తేదీ నుంచి అక్టోబరు 30 వరకూ ఇంటింటికి తెదేపా కార్యక్రమం నిర్వహించేలా అధినేత ప్రణాళిక రూపొందించారన్నారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్న తెదేపాకు భవిష్యత్‌లో ఏ ఎన్నికల్లో అయినా విజయం సాధించే సత్తా ఉందని తెలిపారు.

పార్టీ కార్యక్రమాల్లో రాష్ట్ర స్థాయిలో ఒకటి, రెండు స్థానాల్లో నిలుస్తున్న జిల్లా ప్రాధాన్యతను కాపాడేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ ఛైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు మాట్లాడుతూ సకాలంలో సాగు నీటి విడుదల పట్ల రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోందన్నారు మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, పార్టీ నాయకులు పీవీ ఫణికుమార్, ఇలియాస్ పాషా మాట్లాడారు. కార్యక్రమంలో అసిఫ్‌పాషా, వంపుగడల చౌదరి పాల్గొన్నారు.

## 8న జాతీయ లోక్ అదాలత్

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి దుర్గారావు

చిత్తూరు : అపరిష్కృత కేసుల పరిష్కారం, కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలనే ఉద్దేశంతో దేశవ్యాప్తంగా ఈనెల 8న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి దుర్గారావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా న్యాయస్థానంలో విలేకరులతో మాట్లాడారు. చిత్తూరుతో పాటు 13 మండలాల్లోని న్యాయస్థానాల్లో జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుందని చెప్పారు. దీనికోసం 22 బెంచ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. రాజీమార్గంలో పరిష్కారమయ్యే క్రిమినల్, చెక్‌బౌన్స్, ఎక్సైజ్, బ్యాంకు రికవరీ, సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు.

కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసుల నుంచి విముక్తి పొందాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల అధికారులు సహకరించాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులకు అప్పీలు ఉండదని, సివిల్ కేసులకు న్యాయస్థానం రుసుము తిరిగివ్వడం జరుగుతుందని వెల్లడించారు. ఈ సంవత్సరం లోక్ అదాలత్ ద్వారా జిల్లాలో 6,853 కేసులు పరిష్కరించి.. సుమారు రూ.2 కోట్లు సెటిల్‌మెంట్ చేసినట్లు చెప్పారు.

ప్రభుత్వం తరపున న్యాయసేవా సదన్ ద్వారా దారిద్రోంఖకు దిగువునున్న 107 మంది కక్షిదారులకు న్యాయవాదులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవా సదన్ ద్వారా గ్రామాలు, పాఠశాలల్లో 330 అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి చట్టాలు, న్యాయ పరమైన అంశాలపై వివరించామని తెలిపారు. తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కపర్తి, జిల్లా న్యాయసేవాసదన్ కార్యదర్శి నాగశైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ విద్యార్థులకు కార్పొరేట్ విద్య

కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఎస్సీ విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్యను అందించటానికి సంకల్పించింది. బెస్ట్ అవైలబుల్ పథకం పేరుతో 1, 5 తరగతుల్లో జిల్లాలోని వివిధ కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించింది. దీనిలో భాగంగా కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో ఆన్‌లైన్‌లో ఎంపికైన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు శోభారాణి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. 1వ తరగతి విద్యార్థులకు డే-స్కాలర్‌గా, 5వ తరగతి విద్యార్థులకు హాస్టల్ వసతి పాటు జిల్లాలోని 33 కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు. 1వ తరగతిలో 200 మందికి, 5వ తరగతిలో 350 మందికి ప్రవేశాలు కల్పిస్తూ నియామకపత్రాలు అందజేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ ప్రక్రియ రాత్రి వరకూ కొనసాగింది. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, ఎస్సీ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.చంద్రరావు, పర్యవేక్షకులు కొండేపూడి సుబ్బారావు, కుసుమ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై నిపుణుల కమిటీ విచారణ

నకరికల్లు : చల్లగుండ్ల అడ్డరోడ్డు సమీపంలో ఓడరేవు రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అయిదుగురు మృత్యువాత పడ్డారు. జిల్లాలో అయిదుగురుని బలిగొన్న ఈ సంఘటన అందర్నీ కలచివేసింది. రక్తం చిందిన రహదారిపై జిల్లా అధికారులు సైతం విచారణకు ఆదేశించారు. ప్రమాద ఘటనకు గల కారణాలపై ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అతివేగంగా వస్తున్న ఆటో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ట్రక్ ఆటోను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ప్రమాదం ఎలా జరిగింది, రోడ్డు నిర్మాణంలో లోపాలు ఏమైనా ఉన్నాయా, అసలు ప్రమాదానికి గల కారణాలపై నిపుణుల కమిటీ నిశిత పరిశీలన చేసింది. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) పీజీ రాజారత్నం, నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ కోటేశ్వరరావు, నరసరావుపేట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టరు(ఎంవీఐ) ఎ.కిరణ ప్రభాకర్, నరసరావుపేట గ్రామీణ సీఐ బి.ప్రభాకర్, వన్‌టౌన్ సీఐ ఎం.వీరయ్య ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరిపారు. రోడ్డు నిర్మాణంలో లోపాలు ఉన్నాయా, లేదా మరేమైనా కారణాలు ఉన్నాయా అనే దానిపై ఆరా తీశారు. సదరు ఘటన ప్రాంతం బ్లాక్‌స్పాట్ ఏరియా, కాదా అనే దానిపై పరిశీలించారు.

ప్రమాద తీవ్రత దృష్ట్యా నిపుణుల కమిటీ అన్ని కోణాల్లో విచారించింది. ప్రమాదానికి కారణమైన ఆటోను నిశితంగా పరిశీలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం ఏమైనా ఉందా అనే దానిపై పలు అంశాలను పరిశీలించారు. ప్రమాద తీవ్రతకు తారురోడ్డు సైతం గీతలు పడి ఉండటాన్ని గమనించారు. సదరు ఓడరేవు రహదారి ప్రస్తుత వాహనాల రద్దీని తట్టుకునే విధంగా లేదని నిర్ణయించినట్లు తెలిసింది. ఎప్పుడో నిర్మించిన సింగల్ రహదారిపై ప్రస్తుతం వాహనాల ఎక్కువగా తిరగటంతో ట్రాఫిక్ పెరిగిపోయినట్లు గుర్తించారు. పెరిగిన వాహనాల రద్దీ దృష్ట్యా తక్షణమే ఓడరేవు రహదారిని నాలుగు వరసల రహదారిగా మార్పు చేయటంతో అందుకు నిధులు విడుదల చేసేలా ప్రతిపాదనలు పంపనున్నట్లు నిపుణుల కమిటీ తెలిపింది. త్వరలో నివేదికను జిల్లా కలెక్టర్ కోన శశిధర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.

## ఘనంగా పెంపుడు జంతువుల దినోత్సవం

### పెంపుడు జంతువు సంరక్షణ మన బాధ్యత –ఐజీ డాక్టర్ కాంతారావు




తిరుపతి : పెంపుడు జంతువులు, మానవుల మధ్య అవినాభావ సంబంధం ఉందని.. మానవ మనుగడలో జంతువులు కీలకంగా మారాయని ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక కార్యదళం ఐజీ డాక్టర్ మాగంటి కాంతారావు అన్నారు. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయ సమీపంలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య కళాశాల బోధనాసుపత్రి ప్రాంగణంలో పెంపుడు జంతువుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.ఈశ్వర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కళాశాల పూర్వవిద్యార్థి ఐజీ డాక్టర్ కాంతారావు, పశువైద్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ వై.హరిబాబు, నగరపాలక కమిషనర్ హరికిరణ్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. డాక్టర్ కాంతారావు మాట్లాడుతూ పశువైద్య విద్య సమాజసేవకు గొప్ప అవకాశం కల్పిస్తుందని, మూగజీవాలకు వైద్యం అందించే అవకాశం లభించడం ఒక వరం అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. పశువులు, ఇతర జంతువులకు వైద్యం అందించే సమయంలో వైద్యులు జాగ్రత్త వహించాలని సూచించారు. విద్యార్థి దశలో తన అనుభవాలను ఆయన పంచుకున్నారు. పలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వాటి ఫలితాల గురించి ఆయన వివరిస్తూ వైద్యులు పాటించాల్సిన జాగ్రత్తల గురించి ప్రస్తావించారు. కమిషనర్ హరికిరణ్ మాట్లాడుతూ జంతువులను కొందరు హోదా కోసం, కొందరు తోడు కోసం, మరికొందరు ప్రేమతో పోషిస్తుంటారన్నారు. మనకు తోడునీడగా ఉన్న పెంపుడు జంతువుల ఆరోగ్యం పట్ల యజమానులు జాగ్రత్త వహించాలన్నారు. వచ్చే ఏడాదిలోపు నగరంలోని అన్ని వీధిశునకాలకు వ్యాధి నిరోధక, రేబీస్ టీకాలు వేసి సంరక్షణ చర్యలు చేపడతామన్నారు. వీధి శునకాల విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలు, అమల్లో ఉన్న చట్టాలను పరిగణలోకి తీసుకుని చర్యలు తీసుకుంటామన్నారు. నగరవాసులు సైతం ఎక్కడబడితే అక్కడ చెత్త విసరడం వల్ల వీధి శునకాల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. నగరంలో మాంస విక్రయాలను నియంత్రించి నిబంధనల ప్రకారం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు పశువైద్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ వై.హరిబాబు మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు ఎక్కువగా రేబీస్, బ్రూసిల్లస్, అంత్రాక్స్, లెప్టోస్పైరోసిస్ లాంటి పలు వ్యాధులు సోకుతాయన్నారు. తిరుపతి పశువైద్య కళాశాలలో రాష్ట్రస్థాయి పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఉందని దానినుంచి అనేక వ్యాధులను నిర్ధారణ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. పెంపుడు జంతువులను ఆదరించడంతోబాటు వాటికి ఎలాంటి వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని ఆకాంక్షించారు. అనంతరం అతిథులు ఉచితంగా టీకాలను వేసి ఉచిత టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు డాక్టర్ మాధవరావు, డాక్టర్ పీఎస్ కరుణానిధి, విశ్వవిద్యాలయ అధికారులు డాక్టర్ రాఘవరావు, డాక్టర్ డి.శ్రీనివాసులు, డాక్టర్ పద్మనాభరెడ్డి, డాక్టర్ వెంకటరమణ, బోధనాసుపత్రి అధినేత డాక్టర్ శ్యామ్‌సుందర్, అధ్యాపకులు డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి నగరం నలుమూలల నుంచి పెంపుడు జంతువులు బోధనాసుపత్రికి తరలివచ్చాయి. పెంపుడు జంతువుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా పెద్దసంఖ్యలో పెంపుడు జంతువులు తాతయ్యగుంట గంగమ్మ ఆలయం సమీపంలోని పశువైద్య కళాశాల బోధనాసుపత్రికి తరలివస్తుంటాయి. ఆయా శునకాలకు ఉచితంగా రేబీస్ టీకాలు వేశారు. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులు గురించి అవగాహన కల్పించే కరపత్రాలను పంపిణీ చేశారు. పలు సంస్థలు పెంపుడు జంతువుల ఆహార పదర్శనశాలను ఏర్పాటుచేశాయి. అందమైన, చూడ ముచ్చటైన పలు జాతుల కుక్కలు విచ్చేసి తమ చేష్టలతో అలరించాయి. భారీ పరిమాణంలో ఉన్న శునకాలను సైతం చూసి పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పశువైద్య కళాశాల బోధనాసుపత్రిలో సందడి వాతావరణం నెలకొంది.

## ప్రజలతో, భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి

### అదనపు ఎస్పీ ఎంవీఎస్‌స్వామి



తిరుపతి : ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరంలో పనిచేసే బ్లూకోల్ట్స్, రక్షక్ పోలీసు సిబ్బంది ప్రజలతో, భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని శాంతి, భద్రతల అదనపు ఎస్పీ ఎంవీఎస్‌స్వామి సూచించారు. ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో 110 మంది సిబ్బందితో ఏడు రక్షక్, 15బ్లూకోల్ట్స్ వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ అర్బన్‌జిల్లా ఎస్పీ అభిషేక్ మహంతి ఆదేశాలతో శాంతిభద్రతలు, అసాంఘిక కార్యక్రమాలను నియంత్రించడంలో భాగంగా విజిబుల్ పోలీసింగ్‌ను విస్తృతం చేస్తూ రక్షక్, బ్లూకోల్ట్స్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈస్ట్, వెస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని బ్లూకోల్ట్స్, రక్షక్ సిబ్బందిని ఈస్ట్ పరిధిలోని సీసీకెమెరా నిఘా, నియంత్రణ కేంద్రం పరిధిలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆయా స్టేషన్‌ల పరిధిలో ఉన్న ఈ విధానాన్ని మొత్తం ఈస్ట్‌పోలీస్‌స్టేషన్ నిఘా కేంద్రానికి అనుసంధానం చేసి పర్యవేక్షణాధికారిగా ఎస్సీఎస్టీసెల్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డిని నియమించామని చెప్పారు. ప్రతి రక్షక్ వాహనంలో ఒక ఏఎస్ఐ స్థాయి అధికారి, ఇద్దరు స్పెషల్ పార్టీ సిబ్బంది ఉంటారని, బ్లూకోల్ట్స్‌లో ప్రతి వాహనానికి ఇద్దరు పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. ప్రతిఒక్కరికి మ్యాన్‌ప్యాక్, ఫస్ట్‌ఎయిడ్ కిట్, టార్చ్, బ్యాటెన్ అందుబాటులో ఉంటుందన్నారు.

ఈ వాహనాలన్నీ షిప్టు విధానంలో 24గంటల పాటు ఏడురోజులు పనిచేస్తాయన్నారు. పోలీసులు ప్రజలు, యాత్రి కులు, వృద్ధులు, మహిళల పట్ల స్నేహపూర్వ కంగా వ్యవహరించాలన్నారు. దేశ, రాష్ట్ర పోలీసు పనితీరును ఇక్కడినుంచే ప్రతిబింబిస్తుందనే విష యాన్ని గుర్తించుకోవాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే నిమిషాల్లో అక్కడకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈస్ట్ సబ్‌డి విజన్ డీఎస్పీ మునిరామయ్య, వెస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ కనకరాజు, ఎస్‌బీ డీఎస్పీ రవిమనో హరా చారి, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.




# చిన్నారుల్లో డిప్రెషన్



ఒకే ఇంట్లో ఉండే ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఒకలా, మరొకరిని ఇంకోలా చూస్తే వారిలో ఆత్మ న్యూనతా భావం పెరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నతనంలో పిల్లల మధ్య వారి తెలివితేటల విషయంలో ఉన్న తేడా పట్ల తల్లిదండ్రులు ఎంత సమతూ కంతో వ్యవహరిస్తే అంత మంచిది. ఇలా వారి మధ్య ఉండే తేడాలను పదేపదే ప్రస్తావించి వారిపై మానసిక ఒత్తిడి తెస్తే మాత్రం ఆ భావన ఆ పిల్లల్లో పెరిగి తామెం దుకూ పనికిరామన్న ఆత్మ న్యూనతకు దారి తీస్తాయి. ఈ బీజాలను నాటేది వేరెవరో కాదు...స్వయానా తల్లిదండ్రులే. దాని వల్ల పిల్లలు పెద్దయ్యాక వారి మధ్య ప్రేమానురాగాలు పెంపొందడానికి బదులుగా ఈర్ష్య, అసూయలు వెల్లువెత్తుతాయి. ఇదే ఆత్మన్యూనతా భావంగా స్థిరపడుతుంది.

ఈ ఆత్మన్యూనతా భావం అనేది ఒక వ్యక్తి జీవితంలో వారి చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఇతర పెద్దల అజాగ్రత్తవల్ల, బాఎధ్యతా రహితమైన వ్యాఖ్యల వల్ల వారి మస్తిష్కంలో నాట బడ తాయి. దాని ప్రభావం మనిషి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసిగాని వదలదు. పెద్దలు పిల్లలను తోటి పిల్లలతో పోల్చి మాట్లాడడం లాంటి పొరపాటు చేస్తుంటారు. ఆ మాటలకు ఆ లేత హృదయాలు ఎంతగా గాయ పడతాయో చెప్ప లేము.

ఇక ఆడపిల్లలైతే రూపలావణ్యాలతో అక్కతో, చెల్లితో పోల్చి వారు బాధపడేలా చేస్తారు. రంగులో ఆ పిల్లలను పోల్చి బాల్యం లోనే నల్ల పిల్ల అని ముద్ర వేస్తారు. పొట్టివారైతే పొట్టిపిల్ల అని అంటూ ఆ భావన వారిలో కలిగేలా చేస్తారు. ఇలాంటి మాటల వల్ల ఆ పిల్లల్లో ఆత్మన్యూనతాభావం క్రమంగా పెరిగి బాధను ఎవరికీ చెపలేక తమలో తామే కుంగిపోతుంటారు.

# ముఖవర్చస్సుకు క్యారెట్



మహిళలకు అందమైన మోముంటే అందరూ చాలా బాగుందంటారు. దీనికి రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు. కాని ఇంట్లో దొరికే వస్తువులతో ప్రయోగాలు చేసుకోవచ్చంటున్నారు సౌందర్య నిపుణులు.

దీనికి చేయవలసిందల్లా ఒక్కటే... బంగారం లాం టి మేనిమి ఛాయ బంగారంలా మెరవాలన్నా, కంటి ఆరోగ్యం కోసం విటమిన్ ఏ పుష్కలంగా ఉండే క్యారెట్టును వాడాలంటున్నారు. బ్యుటీషియన్స్. ముందుగా ఒక క్యారెట్‌ను తురుముకోవాలి.

అందులో ఒక చెంచా పాలను అందులో కలుపుకొని కాసింత నీటిలో ఉడకబెట్టాలి. చల్లారిన తర్వాత పాలనుకలుపుకుని ముఖానికి, శరీరానికి పట్టిం చండి.

అరగంట అయిన తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రపరచండి. దీంతో మీ చర్మం కాంతి వంతంగా మారడమే కాకుండా మృదువుగా తయార వుతుంది. ఏదైన వాడే ముందు వాటికి తగిన జాగ్రత్తలు పాటించడం చాలా మంచిది. ఎందుకంటే ప్రస్తుత రోజుల్లో స్కీన్ సమస్యలు దృష్టిలో ఉంచుకుని వాటిని వాడటం మరి మంచిది. అందం గురించి జాగ్రత్తలు తీసుకునే మందు ఆరోగ్యం గురించి జాగ్రత్తలు పాటించడం ఇంకా మంచిది.

# కడుపులో రాళ్లు పడితే..!

- పిత్తాశయంలో కదలికలు మందగిస్తాయి
- కడుపులో రాళ్లను తొలగించడమే పరిష్కారం
- రాళ్లు ఎక్కువగా ఉంటే జీర్ణం కాదు
- పిత్తాశయ గోడల్లో వాపు వస్తుంది




ఇటీవల కాలంలో కడుపులో రాళ్లు పడటం అన్నది కామన్‌గా మారింది. ఈ మధ్య చిన్న పిల్లల్లో కూడా ఈ సమస్యను గుర్తించటం జరుగుతోంది. తీవ్రమైన కడుపు నొప్పితో బాధ పడుతున్న వారిలో ఈ సమస్య కనిపిస్తోంది. జీర్ణ వ్యవస్థలోని పిత్తాశయం (గాల్ బ్లాడర్), క్లోమం (పాన్ క్రియాజ్) వంటి భాగాల్లో ఈ రాళ్లు ఏర్పడుతుంటాయి. ఈ రాళ్లతో వచ్చిన అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. ఈ రాళ్లను బట్టి చికిత్స ఆధారపడి ఉంటుంది. రాళ్లను తొలగించటం అన్నది అంతిమ పరిష్కారం అని గురుంచుకోవాలి.

పైత్యరసంలోని కొలిసిస్టిన్ ఎక్కువగా ఏర్పడి నప్పుడు ఇబ్బంది ఏర్పడుతుం ది. దీంతో పాటు పిత్తాశయంలో వాపు ఏర్పడే అవకాశం ఉంటుం ది. దీన్ని కొలిసిస్టిటిస్ అని వ్యవహరిస్తారు. నొప్పి తీవ్రత ద్వారా దీన్ని గుర్తించవచ్చు. కుడి వె%పు పై భాగంలో ఇది మొదలవుతుంది. తర్వాత కుడిపైపు స్కా పుృలా ఎముక ఉండే చోటికి వ్యాపించవచు. చాలాసార్లు వేపుళ్లు, నూనె దినుసులు, జంక్ ఫుడ్ తిన్న తర్వాత తలెత్తుతుంటుంది. కొద్ది పా టి జ్వరం, డయేరియా, వాంతులు, నాసియా వంటి లక్షణాల్ని కూడా గమనించవచ్చు. కొన్ని సార్లు పిత్తాశయం గోడల్లో వాపు గమనించవచ్చు. తీవ్రమె%న కేసుల్లో నెక్రోసిస్, గోడల్లో ధ్వంసం జరగటాన్ని చూడవచ్చు. గోడలు వాపు ఏర్పడిన పరిస్థితిని సాధారణ కొలిసిస్టిటిస్‌గా వ్యవహరిస్తారు. తర్వాత కాలంలో పిత్తాశయం లో కదలికలు బాగా మందగిస్తాయి. వ్యాధి ముదిరిన దశను తీవ్రతర కొలిసిస్టిటిస్‌గా చెబుతారు.

ఇక క్లోమం విషయానికి వస్తే .. క్లోమంలో స్రవించే ఎంజైమ్‌లు పేగుల్లోకి వచ్చి అక్కడ అహారాన్ని జీర్ణం చేయాల్సి ఉంటుంది. కొన్ని సార్లు ఈ ఎంజె%మ్‌లు క్లోమంలోనే ఉండి పోయి అక్కడ పనిచేయటం మొదలు పెడతాయి. ముఖ్యంగా ట్రిప్సిన్ ఇటువంటి పనులకు పాల్పడుతుంది. దీంతో క్లోమం లోపలి గోడలు పాడె% పోతాయి. క్రమంగా మొత్తం క్లోమం దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుంది. దీన్నే పాన్‌క్రియాటిస్‌గా వ్యవహరిస్తారు. ఇక, రాళ్ల సమస్య పెద్దదిగా అయినప్పుడు ఇతర జీర్ణ భాగాలకు ఇబ్బది తలెత్తవచ్చు. కొన్ని సార్లు క్లోమంలో కాల్సియం డిపాజిట్లు ఎక్కువగా పేరుకొని పోతే రాళ్లుగా మారతాయి. ఇవి జీర్ణ రసాల్ని అంటే ఎంజైమ్‌ల స్రావాన్ని అడ్డుకొనుట ద్వారా సమస్యల్ని తెచ్చి పెడతాయి. తీవ్రమైన నొప్పితో పేషంట్లు బాధ పడతారు.

పిత్తాశయంలో రాళ్లను గుర్తించాక అది ప్రాథమిక దశలో ఉందా, లేక వ్యాధి తీవ్రం అవుతోందా అన్నది తేల్చుకొంటారు. చాలా ప్రాథమిక దశ అయినప్పుడు మందులతో వాటిని కరిగించేందుకు యత్నిస్తారు. లేని పక్షంలో కొలిసిస్టెక్టమీ అనే ఆపరేషను అవసరం అవుతుంది. పూర్వం కడుపుని కోసి ఈ ఆపరేషను చేయాల్సి వచ్చేది. ఇప్పుడు లాపరోస్కోపీ విధానంలో ఇది చాలా సురక్షితంగా, తేలికగా మారింది. చాలా సార్లు పిత్తాశయాన్ని తొలగించటమే అంతిమ పరిష్కారం అవుతుంది. క్లోమంలో రాళ్లను కరిగించటానికి లిథో ట్రి ప్సీ టెక్నిక్‌లను ఉపయోగిస్తారు. ఆధునిక టెక్నాలజీ సాయంతో దీన్ని సురక్షితంగా తేలిగ్గా పూర్తి చేయవచ్చని గుర్తుంచుకోవాలి. ఇది ఆధునిక టెక్నాలజీ తో కూడిన ఆపరేషన కాబట్టి నిపుణులె%న సర్జన్‌లతో చేయించుకోవటం మేలు.

మానవ శరీరంలో అతి చిన్న భాగాల్లో ఒకటిగా పిత్తాశయంను చెప్పుకోవచ్చు. కడుపులో కుడి వైపున పై భాగంలో ఇది అమరి ఉంటుంది. కాలేయానికి కింది భాగంలో ఉండే సంచీ వంటి భాగం ఇది. ఒక రకంగా చెప్పాలంటే కాలేయానికి అనుసంధానంగా వ్యవహరించే భాగం అనుకోవచ్చు. కాలేయం నుంచి స్రవించే పైత్య రసం తాత్కాలికంగా నిల్వ ఉండే సంచీ వంటి భాగమే పిత్తాశయం. పైత్య రసంలో వాస్తవానికి ఎటువంటి ఎంజైములు ఉండవు. కానీ, జీర్ణక్రియకు సహకరించే కొలెస్టిరాల్, బైలి రుబిన్ అనే పదార్థాలు ఇందులో ఉంటాయి. పైత్య రసం పిత్తాశయంలో ఎక్కువగా నిల్వ ఉన్నప్పుడు కొలిస్టిరాల్‌కానీ, బైలిరుబిన్ కానీ ఎక్కువగా పేరుకొని పోతుంది. అటువంటప్పుడు ఈ పదార్థాలు ఘన రూపంలోకి మారి రాళ్లుగా పరిణామం చెందుతాయి. కొలిస్టిరాల్ కానీ రాళ్లుగా మారితే కొలిస్టిరాల్ రాళ్లు అనీ, బైలిరుబిన్ ఘన పదార్థంగా మారితే పిగ్మెంట్‌రాళ్లు అని వ్యవహరిస్తారు. పైత రసం లో ఇతర పదార్థాల శాతం పెరిగిపోయినా ఇది తలెత్తవచ్చు. కాలేయ వ్యాధులు, రక్త ప్రస రణ వ్యాధులు తలెత్తినప్పుడు కూడా రాళ్లు వస్తుంటాయి. రాళ్లతో నేరుగా వచ్చే ప్రమాదం కంటే ఇతర సమస్యలతో ఇబ్బందులు ఉంటాయి.

# గోళ్ళ ఆరోగ్యమే ... వేళ్ళ అందం

శుభ్రత అనగానే ముందు గుర్తురావాల్సింది చెతులకున్న గోళ్లు. ఎందుకంటే, మనం ఏం తిన్నా ముందు నోట్లోకి వెళ్లాడానికి అస్కారం ఉంది. కాబాట్టి అలాంటి గోళ్లనే మనం నిర్లక్ష్యం చేస్తే, అది అనారోగ్యమని తెలిసినా సరే! ఎప్పటికప్పుడు అనుకుంటూనే మరేం ఫర్వాలేదని బద్ధకించేయడమూ మనకున్న నిత్యమైన అలవాటు. గోళ్ల విషయం లోనే! పైగా గోళ్లను చూసి ఆరోగ్యం ఎలా ఉందో చెప్పేస్తారు వైద్యులు. మరి నఖాల గురించి కొన్ని విషయాలు తెలుసుకుంటే ఆపై జాగ్రత్తలు తీసుకోవడం ఎంత అవసరమో తెలిసిపోతుందిగా!కొందరు రికార్డుల కోసం గోళ్లను పెంచుతుంటారు.అలాంటి వారికి ఇవి చాలా ఉపయోగకరం గోళ్లను పెంచుతారు కాని వారు శుభ్రం పాటించరు అలాంటి వారు క్రింది విధానాలను తెలుసుకోవచ్చు.గోళ్లు కొరుక్కోవడం అనే అలవాటు ఉంటే తక్షణం మానుకోవడం బెటర్!

గోళ్లు ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. ఎన్నో రకాల సూక్ష్మక్రిములు, మట్టి నోట్లోకి వెళ్లేది గోళ్ల ద్వారానే! స్నానం తరువాత కత్తిరించుకుంటే గోళ్లు మెత్తగా ఉండి కత్తిరించడం సులువవుతుంది. లేకుంటే పెళుసుగా ఉండి విరిగిపోతాయి. నెయిల్ పాలిష్ వేసుకోవడం ఓకే! కానీ, అదేపనిగా గోళ్లరంగు మంచిది కాదు. ఎందుకంటే రసాయనాలు నిండిన గోళ్లరంగు నోట్లోకి వెళితే అనేక అనర్థాలకు దారితీస్తుంది. గోళ్లు పగుళ్లు తీసినట్లున్నా, కాంతిహీనంగా ఉన్నాయంటే మన శరీరంలో విటమిన్ ఎ, కేల్షియమ్ లోపించాయని అర్థం. అందుకే విటమిన్ ఎ ఉన్న కేరెట్లు, పళు ్లు, ఆకుకూరలు, కేల్షియమ్ మెండుగా ఉన్న పాలు, బాదాములు అధికంగా తీసుకోవాలి. అప్పుడే గోళ్లు గులాబీ రంగులో చూడముచ్చటగా మారేది! కాలకృత్యాలు తీర్చుకున్నాక ఎప్పటికప్పుడు సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. డబ్బాల మూతలు తీయడానికి గోళ్లను ఉపయోగిస్తున్నారంటే చేతులారా వాటిని పాడుచేస్తున్నట్లే! ఈ



**అలవాటుకు స్వస్తి పలికితే నయం!**

ముఖ్యంగ రాత్రి నిద్రపోయే ముందు చేతులు శుభ్రంగా కడుక్కుని, తుడుచుకున్నాక మాయిశ్చరైజర్ అప్లై చేస్తే చేతులు, గోళ్లు మృదువుగా ఉంటాయి.

సబ్బుల వాడకం సమయంలో జాగ్రత్త పాటించాలి.

శరీరానికే కాదు, నీరు గోళ్లకూ అవసరమే! కాబట్టి, మంచినీళ్లు ఎక్కువగా తాగండి!అహారం తీసుకొనే సమయంలో వాటిని చాలా శుభ్రం చేసుకోవాలి.

నాణ్యమైన నెయిల్‌పాలిష్ వాడితే మంచిది.

నెయిల్ పాలిష్ తీయాలంటే బ్లేడుతో గీకడం కాకుండా నెయిల్ పాలిష్ రిమూవర్ ఉపయోగించాలి.

గోళ్లను పెంచే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

తాజా పోషకాహారం తీసుకుంటే గోళ్లూ ఆరోగ్యంగా ఉంటాయి.

12 విటమిన్ లోపిస్తే గోళ్లు పొడిబారి, నల్లగా మారతాయి. గుడ్డు, పాలు, మాంసం... వంటివాటిలో

12 సమృద్ధిగా వుంటుంది.ఈ జాగ్రత్తలు చాలు! గులాబీ వర్ణంలో మెరిసే సౌందర్యం మీ సొంతమవడానికి! చూపరులను ఇట్టే ఆకట్టుకోవడానికి!

# మాతృత్వపు మధురిమ ఆస్వాదించండి



గర్భధారణ సమయంలో శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకోవడం చాలా సర్వసాధరణం. ఈ మార్పులు ప్రతి మహిళ శరీరంలోనూ ఏర్పడుతాయి. గర్భధారణ సమయంలో మహిళలకు సాధారణ జీవితాన్ని గడపాలని సూచిస్తుంటారు. అయితే గర్భధారణ సమయంలో ప్రమాదకర కార్యకలాపాలు కొన్ని ఉన్నాయి. కాబట్టి గర్భధారణ సమయంలో ఎల్లప్పుడూ సురక్షితంగా ఉండటం ఉత్తమైన మార్గం. దాని తర్వాత అన్నీ. ఎందుకంటే గర్భధారణ అనేది 9నెలలు మాత్రమే కాబట్టి ఆ 9నెలలు మహిళలకు చాలా విలువె%న సమయంగా భావించాలి. గర్భధారణ సమయంలో ఎటువంటి కార్యకలాపాలు ప్రమాదకరమె%నవో మీకు తెలిసుండకపోవచ్చు. కానీ మనకు తెలసిన కొన్ని కార్యకలాపాలు మాత్రం న్యూట్రీషియన్ ఫుడ్ అధికంగా తీసుకోవాలి. దూరప్రయాణాలు చేయకూ డదు. దగ్గర ప్రయాణలైనా తగు జాగ్రత్తలు తీసుకోవాలి మరియు అధిక బరువులు మోయకూడదు మొదలగునవి. కాబట్టీ మీ గర్భధారణ సమయంలో సురక్షితంగా ఉండటానికి చాలా చాలా లౌకిక విషయాలను తెలుసుకోవల్సిన అవసరం ఉంది. ఉదా: మీకు రాక్ బ్యాండ్ యొక్క సంగీతానికి హాజరు కావడం అనేది గర్భధారణ సమయంలో ప్రమాదకర కార్యకలాపంగా చెప్పవచ్చు. గర్భధారణ సమయంలో అధికంగా వ్యాయామం చేయడంతో హార్ట్ బీట్ పెరుగుతుంది మరియు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా పెంచుతుంది. గర్భధారణ సమయంలో ఉదర భాగంలో వ్యాక్సింగ్ చేయించుకోవడం కూడా మంచిది కాదు. ఇటువంటి కొన్ని చిన్న విషయాలు మీ గర్భధారణ సమయంలో సురక్షితమా కాదా అని గుర్తించేందుకు మరికొన్ని మీకోసం బోల్డ్ స్కై అందిస్తుంది. ఈ రిస్కీ యాక్టివిటీస్ కు గర్భాధారణ సమయంలో దూరంగా ఉండీ ఆరోగ్యాన్ని సురక్షితం చేసుకోండి... ఫర్నీచర్‌ను మార్చకూడదు సాధారణంగా ఇంట్లో వస్తువులు ఫర్నీచర్‌ను ఇక్కడి అక్కడ.. అక్కడవి ఇక్కడ మార్చుతుంటారు. అయితే మీ గర్భధారణ మొదటి సెమిస్టర్ (మొదటి మూడు నెలల్లో) ఇటువంటి రిస్కీ యాక్టివిటీస్ ను నివారించడం చాలా క్షేమం. ఇది మీ మీద ఒత్తిడిని పెంచుతుంది.

**పిల్లలను మోయడం** మీ రెండవ ప్రెగ్నెన్సీ కంటే ముందు మీకు పిల్లలను చూసుకోవల్సిన బాధ్యత ఉంటుంది కాబట్టి, వారు 5కేజీల బరువు కంటే ఎక్కువగా ఉన్నప్పుడు అతనిని/ఆమెను ఎత్తుకోవడం నివారించడం. లేదంటే మీ వెన్నుకు ఒత్తిడి కలిగించవచ్చు. స్కేటింగ్ వ్యాయామంలో చాలా మంది రోలర్ స్కేటింగ్‌ను ఉపయోగిస్తారు. అయితే మహిళలు గర్భధరించినప్పుడు, ఈ రోలర్ స్కేటింగ్ వ్యాయామాన్ని మానుకోండి. రోలర్ స్కేటింగ్ చేయడానికి మంచి బ్యాలెన్సింగ్ ఉండాలి.స్టీమ్ బాత్‌గర్భధారణ సమయంలో స్టీమ్ బాత్ చేయడం అనేది చెడు ఆలోచన. ఎప్పుడైతే మీ శరీరం వేడి పొందుతుందో, అప్పుడు మీ చర్మని బ్లెడ్ సెల్స్ రీడైరెక్ట్ గావింపబడి మీ చర్మాన్ని చల్లబరుస్తుంది.

# నీళ్లు సరిగ్గా తాగడం లేదని తెలిపే డేంజర్ సంకేతాలివే..

*నీళ్లు తాగుతున్నారా ? అంటే బాగా తాగున్నాను అన్న సమాధానమే చాలా మంది చెబుతారు. కానీ.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక బాటిల్ లేదా ఒక లీటర్ కూడా నీళ్లు తాగి ఉండరు. ఇది ఒకరు, ఇద్దరి సమస్య కాదు. చాలా మంది నీళ్లు తాగాలంటే చాలా బద్ధకంగా ఫీలవుతారు. అలాగే నీళ్ల తాగడం అంటే.. ఏదో మెడిసిన్ తాగినట్టు ఫీలవుతుంటారు. కానీ.. నీళ్లు తాగడం చాలా అవసరం. ఎందుకంటే.. మనుషుల శరీరం మూడోవంతు నీటితోనే నిర్మాణమై ఉంటుంది. కాబట్టి నీళ్లు సరిగా అందకపోతే.. శరీరంలో అనేక సమస్యలు ఎదురవుతాయి. 10 రోజుల్లో ఎఫెక్టివ్ గా బరువు తగ్గించే వాటర్ డైట్ శరీరంలోని ప్రతి భాగం, ప్రతి చిన్న అవయవం, టిష్యూ, కణం అన్నీ కూడా నీటిపై ఆధారపడి ఉంటాయి. శరీరానికి సరిపడా నీళ్లు తాగడం వల్ల శరీరంలో ఫ్లూయిడ్స్ స్థాయి బ్యాలెన్స్‌గా ఉంటుంది.*

*బాడీ టెంపరేచర్ రెగ్యులేట్ అవుతుంది. మలినాలు బయటకు వెళ్లడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. అంతే చర్మం ప్రకాశవంతంగా కనిపించడానికి కూడా నీళ్లు తాగడం తప్పనిసరి. రైస్ వాట్‌తో మైండ్ బ్లోయింగ్ బెనిఫిట్స్ అయితే శరీరానికి కావాల్సిన స్థాయిలో నీళ్లు అందకపోతే.. శరీరంలో అనేక మార్పులు కనిపిస్తాయి.*

# చిత్రభాను

# ప్రేమ, పెళ్లి మధ్య సంఘర్షణ

## 'నిన్ను కోరి' రివ్యూ




జెంటిల్మన్, నేను లోకల్ లాంటి హిట్స్ నాని, సరైనోడుతో ఆది పినిశెట్టి, జెంటిల్మన్‌తో నివేద థామస్ మంచి జోష్ మీద ఉన్నారు. ఈ ముగ్గురు కలిసి చేసిన తాజా సినిమా 'నిన్ను కోరి'. ప్రేమించి పెళ్లి చేసుకోవడం, పెళ్లి చేసుకొని ప్రేమించుకోవడం అనే రెండు రకాల కాన్సెప్ట్‌లతో ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు శివ నిర్వాణ రూపొందించారు. రాధాకల్యాణం, అభినందన, మౌనరాగం లాంటి సినిమాల ఛాయలు నిన్నుకోరి చిత్రంలో కనిపిస్తాయి. సినిమాలకు మూలధనమైన ప్రేమ కథలను మళ్లీ మళ్లీ చూపించినా ఏదో పాయింట్ కనెక్ట్ చేసుకొని ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం సినీ నిర్మాత, దర్శకులకూ ధీమా ఉంటుంది. ఆ క్రమంలో వచ్చిన సినిమానే నిన్ను కోరి. విభిన్నమైన ప్రాతలను ఎంచుకొని హిట్లు సొంతం చేసుకొంటున్న నేచురల్ స్టార్ నాని నిన్నుకోరి చిత్రంలో భగ్న ప్రేమికుడిగా నటించారు. భారీ అంచనాలతో వచ్చిన నిన్ను కోరి చిత్రం ఏ మేరకు ఆకట్టుకొన్నాయో తెలుసుకోవాలంటే కథ గురించి తెలుసుకోవాల్సిందే.

ఉమా అలియాస్ ఉమా మహేశ్వర్‌రావు (నాని) వైజాగ్ యూనివర్సిటీ స్టూడెంట్. పల్లవి ఓ కాలేజిలో చదివే స్టూడెంట్. పల్లవికి డ్యాన్స్ నేర్చుకోవాలనే కోరిక ఉంటుంది. స్వతహాగా ఉమ మంచి డ్యాన్సర్ కావడంతో పల్లవి ఆయన వద్ద డ్యాన్సర్‌గా చేరుతుంది. ఉమ, పల్లవి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారుతుంది. ఓ దశలో ఉమ ఏకంగా పల్లవి ఇంటిపై ఉండే పెంట్ హౌస్‌లో అద్దెకు దిగుతాడు. దాంతో పల్లవి తండ్రి, బావ (మురళీ శర్మ, ప ృథ్వీ)తో పరిచయం పెరుగుతుంది. పల్లవి ఇంట్లో ఓ సభ్యుడిగా మారిపోతాడు. అన్ని సక్రమంగా సాగిపోతుండగానే ఉమ ఢిల్లీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ కోసం పల్లవిని వదిలేసి వెళ్తాడు. ఈలోగా పల్లవి పెళ్లి (అరుణ్)తో జరిగిపోతుంది. పల్లవి, అరుణ్ అమెరికాలో సెటిల్ అవుతారు. పీహెచ్‌డీ పూర్తి చేసుకొన్న ఉమ కూడా అమెరికాలోనే ఉద్యోగం చేస్తుంటాడు. ఓ దశలో పల్లవికి దూరమైన బాధతో ఉమ ఉద్యోగం వదిలేసి తాగుడు బానిస అవుతాడు.

ఉమ గురించి తెలుసుకొన్న పల్లవి.. అరుణ్‌కు ఒప్పించి తన ఇంట్లోకి తీసుకొస్తుంది. నేను లేకుండా నీవు సుఖంగా బతుకలేవు అని పల్లవితో ఉమ అంటాడు. పెళ్లి తర్వాత మేము చాలా సంతోషంగా ఉంటున్నాం. కావాలంటే నీవు మమ్మల్ని చూస్తే అది నీకే అర్థం అవుతుంది అని చెప్తుంది. కానీ ఉమ అంత తేలిగ్గా నమ్మడు. ఈ పరిస్థితుల్లో అరుణ్ ఒప్పించి ఉమను తన ఇంట్లో పదిరోజులు ఉండేందుకు పల్లవి తీసుకొస్తుంది. ఈ లోగా అరుణ్‌కు మరో మహిళతో సంబంధం ఉందనే విషయం తెలుస్తుంది. మరో మహిళతో అరుణ్‌కు నిజంగానే రిలేషన్ ఉందా? అరుణ్‌కు అలాంటి రిలేషన్ ఉంటే ఏమైంది ? ఆ పది రోజుల్లో అరుణ, పల్లవిల మధ్య ప్రేమను చూసి మనసు మార్చుకొన్నాడా? పల్లవి, ఉమ మధ్య ఉన్న ప్రేమను చూసి అరుణ్ మనసు మార్చుకొన్నాడా? చివరకు పల్లవి, ఉమ ఒక్కటవుతారా? లేక పల్లవి, అరుణ్ భార్యభర్తలుగానే మిగిలిపోతారా? అనే ప్రశ్నలకు సమాధానమే నిన్ను కోరి చిత్రం.

నిన్ను కోరి సినిమా పల్లవి, అరుణ్ వివాహ వార్షికోత్సవంతో ప్రారంభమవుతుంది. వారి మధ్య ఉన్న ప్రేమ, అనురాగం, ఆప్యాయతలు చకచకగా సన్నివేశాల రూపంలో సాగిపోతాయి.



కానీ తన ప్రేమికుడు నాని కష్టాల్లో ఉన్నాడని తెలుసుకొన్న నివేదా భర్త ఆదికి చెప్పకుండా అక్కడకు వెళ్తుంది. అక్కడే ప్రేక్షకుడికి ట్విస్ట్ ఇస్తాడు దర్శకుడు. అక్కడి నుంచి కథ అమెరికా నుంచి వైజాగ్‌కు చేరుకొంటుంది. తొలిభాగంలో నాని, నివేద ప్రేమ, వారి రొమాన్స్ చక్కగా చిత్రీకరించాడు. ఓ కారణంగా తన కెరీర్ కోసం ప్రేమను త్యాగం చేయడానికి సిద్ధపడిన నాని ఢిల్లీకి వెళ్లిపోతాడు. ఆ తర్వాత నివేద, ఆదిల పెళ్లి జరిగిపోవడం లాంటిని మంచి కథనంతో సినిమా పరుగులు పెడుతుంది. ఇంటర్వెల్ ముందు సీన్‌లో నివేదా, ఆది ఇంటికి నాని చేరుకోవడంతో కథ కొత్త మలుపు తిరుగుతుంది.

రెండో భాగంలో సినిమా ఆసక్తికరంగా ప్రారంభమవుతుంది. నివేదా, ఆది ఎప్పుడు విడిపోతాడా అని నాని ఎదురు చూస్తుంటాడు. తమ ప్రేమను చూసి నాని ఎప్పుడు రియలైజ్ అవుతాడు అని నివేదా ఆది చూస్తుంటాడు. ఇలా మూడు పాత్రల మధ్య సంఘర్షణతో సినిమా సాగుతుంటుంది. కానీ రొటీన్ కథకు ఎలాంటి నావెల్ ట్రీట్‌మెంట్ లేకపోవడంతో సినిమా నత్త నడకన సాగినట్టు అనిపిస్తుంది. సినిమాను క్లైమాక్స్ వరకు లాగడానికి అమెరికాలో బ్రేకప్ వ్యవహారాలకు సంబంధించిన రెండు ఏపిసోడ్స్‌తో కాలక్షేపం జరుగుతుంది. కానీ కథలో ఇంట్రెస్టింగ్ పాయింట్ లేకపోవడంతో చాలా రొటీన్ వ్యవహారంగా సాగిపోతుంటుంది. ఓ దశలో ఇదే గొడవరా బాబు అనే ఫీలింగ్ కలుగుతుంది. చివరకు రొటీన్ ముగింపుతో నిన్ను కోరి ముగియడంతో ప్రేక్షకుడు ఊపిరి పీల్చుకోవడం జరుగుతుంది. చాలా రొటీన్ కథకు నాని, నివేదా, ఆది, మురళీశర్మ లాంటి టాలెంటెడ్ నటులతో సినిమా నిలబడిందనే ఫీలింగ్ కలుగుతుంది.

ప్రేమించి పెళ్లి చేసుకోవడం కంటే పెళ్లి చేసుకొని ప్రేమించాలి అనే సింగిల్ లైన్ కథకు తనదైన శైలిలో దర్శకుడు శివ నిర్వాణ సన్నివేశాలను అల్లుకొన్నాడు. బలమైన డైలాగ్స్‌తో అక్కడక్కడ మంచి ఫీలింగ్‌ను కలిగించాడు. కానీ రొటీన్ పాయింట్‌ను కొత్తగా చూపించడంలో కాస్త తడబడ్డాడు. నాని, ఆది, నివేదా లాంటి ఆర్టిస్టుల ఫెర్మార్మెన్స్‌తో తనలోని లోపాలను దర్శకుడు కప్పిపుచ్చుకొన్నాడు. తొలి సినిమాకే మంచి బడ్జెట్, అమెరికా లాంటి కాస్ట్‌లీ లొకేషన్స్, మంచి కెమెరామెన్ ఇవన్ని దర్శకుడికి కలిసి వచ్చే అంశాలు. కానీ నాని గత సినిమాలు ప్రేక్షకుడిని మెప్పించిన విధంగా నిన్ను కోరి లేకపోవడం కొంచెం డిజాపాయింట్‌మెంట్.

# అమ్మ ప్రేమకు ప్రతిరూపం

## 'మామ్' రివ్యూ



సిల్వర్ స్క్రీన్‌పై గ్లామర్, యాక్టింగ్‌తో ఆకట్టుకున్న అదుతేమైన నటి శ్రీదేవి అంటే ఎలాంటి సందేహం అక్కర్లేదు. తన 53 ఏళ్ల వయసులో శ్రీదేవి నట జీవితం 50 ఏళ్లు. మూడేళ్ల వయసులో 1967 జూలై 7వ తేదీన శ్రీదేవి తొలిసారి కెమెరా ముందుకు వచ్చింది. అప్పటి నుంచి ఐదు దశాబ్దాలపాటు వెండితెర దేవతగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకొన్నారు. బాలీవుడ్ నిర్మాత బోనికపూర్‌తో వివాహం తర్వాత కొన్ని సంవత్సరాలు నటజీవితానికి తాత్కాలికంగా స్వస్తి చెప్పిన శ్రీదేవి ఇంగ్లీష్ వింగ్లీష్ చిత్రంతో సెకండ్ ఇన్సింగ్స్ ప్రారంభించింది.

50 ఏళ్ల నటప్రస్థానాన్ని పురస్కరించుకొని శ్రీదేవి భావోద్వేగమైన కథతో మామ్‌గా జూలై 7వ తేదీన మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మామ్ చిత్రం శ్రీదేవికి 300వ చిత్రం కావడం విశేషం. ఈ చిత్రంలో మానసిక సంఘర్షణ గురైన తల్లి పాత్రను ధరించింది. భర్త బోని నిర్మాణ సారథ్యంలో రూపుదిద్దుకొన్న ఈ చిత్రంలో శ్రీదేవి ప్రేక్షకులను ఏలా మెప్పించింది అని తెలుసుకోవాలంటే కథలోకి వెళ్లాల్సిందే.

దేవిక (శ్రీదేవి) ఢిల్లీలోని ఓ స్కూల్‌లో టీచర్. సవతి తల్లి అయిన దేవకి అంటే కూతురు ఆర్య సభర్వాల్ (సజల్ అలీ)కు ఇష్టముండదు. తల్లిగా ఆమెను అంగీకరించదు. ఇద్దరి మధ్య ఓ రకమైన విభేదాలు ఉంటాయి. ఈ క్రమంలో వాలైంటైన్స్ డేను పురస్కరించుకొని ఓ ఫామ్ హౌస్‌లో జరిగే పార్టీకి ఆర్య వెళ్తుంది. ఆ పార్టీలో నుంచి ఆర్యను జగన్ (అభిమన్యు సింగ్) గ్యాంగ్ (మరో ముగ్గురు) ఎత్తుకెళ్లి కారులో సామూహిక మానభంగం చేస్తారు. తన కూతురుకు జరిగిన దారుణాన్ని చూసిన దేవకి తీవ్రమైన భావోద్వేగానిక గురవుతుంది. పోలీసుల కేసు నమోదు, కోర్టు విచారణలో తప్పుడు సాక్ష్యాలతో నిందితులు కేసును సురక్షితంగా తప్పించుకొంటారు.

అన్యాయానికి గురైన కూతురికి న్యాయం జరుగుతుందని భావించిన దేవకి కుటుంబం ఊహించని షాక్ గురవుతుంది. ఆ పరిస్థితుల్లో దేవకి కుటుంబం ఎలా రియాక్టైంది? నిందితులపై ఎలా ప్రతీకారం తీర్చుకుంది. లైంగిక దాడి దారుణానికి గురైన ఆర్య పరిస్థితి ఏమిటి? ఆర్యపై దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై దేవకి ఏమి చేసింది. తన పగ, ప్రతీకారంలో డీకే (నవాజుద్దీన్ సిద్ధిఖీ) ఎలా తోడ్పాటునందించాడు. ఈ కథలో సీబీఐ అధికారి ఫ్రాన్సిస్‌గా నటించిన అక్షయ్ ఖన్నా పాత్ర ఏమిటి. భావోద్వేగమైన కథకు దర్శకుడు రవి ఉద్యవార్ ఎలాంటి ముగింపు ఇచ్చాడు. దేవకిని ఆర్య అమ్మా అని పిలువడానికి దారితీసిన పరిస్థితులేంటి అనే ప్రశ్నలకు సమాధానమే మామ్ చిత్ర కథ.

# సౌతిండియా మొత్తం 'జై' కొట్టే రికార్డ్....

యంగ్ టైగర్ జూ ఎన్టీఆర్ నటించిన 'జై లవ కుశ' చిత్రంలో 'జై' పాత్రను పరిచయం చేస్తూ గురువారం సాయంత్రం 5.22 గంటలకు విడుదల చేసిన టీజర్ ఇంటర్నెట్లో సంచలనం క్రియేట్ చేసింది. 24 గంట్లోలనే 7.8 మిలియన్ వ్యూస్ సాధించి...... సౌతిండియాలో ఫాస్టెస్ట్ వ్యూస్ సాధించి టీజర్‌గా రికార్డులకెక్కింది. టీజర్‌కు ఇంత భారీ రెస్పాన్స్ రావడంపై ఎన్టీఆర్ స్పందించారు. టీజర్ ఇంత పెద్ద హిట్ కావడానికి కారణమైన అభిమానులు, స్నేహితులు, మీడియాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మీ అభిమానం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. సౌతిండియాలో ఇప్పటి వరకు హయ్యెస్ట్ డిజిటల్ వ్యూస్ సాధించి టీజర్ గా రికార్డు సాధించింది. ఈ రికార్డు అందుకోవడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు అంటూ ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థ ట్వీట్ చేసింది. టీజర్ ఇంత పెద్ద హిట్ కావడానికి కారణమైన అభిమానులు, స్నేహితులు, మీడియాకు ఎన్టీఆర్ ధన్యవాదాలు తెలిపారు. మీ అభిమానం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తూ లవ్ యూ ఆల్ అంటూ ట్వీట్ చేశారు.



# దీపికా ఏంటా రేటూ..?

దక్షిణ భారత చిత్రపరిశ్రమ బాలీవుడ్‌పై వేసిన తిరుగులేని స్టాంప్‌లలో దీపికా పదుకొనే ఒకరు. ఆమె అంగీకరించి సైన్ చేస్తే చాలు వందకోట్ల రాబడి తమ సినిమాకు గ్యారంటీ అంటూ వెంటబడే నిర్మాతలు కోకొల్లలు. సంవత్సరాలుగా నిర్మించుకుంటున్న కెరీర్ పీక్ స్టేజీలో ఉంటున్న దీపిక ఒక సినిమాతో తనకు కలుగుతున్న ఆర్థికపరమైన నష్టాన్ని మరొకరూపంలో తీర్చుకోవాలని చూస్తున్నట్లు సమాచారం. తన ఫేస్ వాల్యూను ఆమె ఏ స్థాయికి పెంచేసిందంటే ఇదివరకు తీసుకునే రెమ్యున రేషన్ కంటే మూడు రెట్లు అమాంతం పెంచేసింది. దీపిక ఇంత డిమాండ్ చేయడానికి కారణం సంజయ్ లీలా బన్సాలీ డైరెక్షన్‌లో చేస్తోన్న 'పద్మావతి' అని టాక్. ఈ సినిమా కోసం ఏకంగా 200రోజులకి పైగా డేట్స్ ఇచ్చేసిందట. అందుకుగాను 12 కోట్లు పుచ్చుకున్నారని భోగట్టా. అయితే, కొన్ని సినిమాలు వదులుకోవాల్సి వచ్చిందట. ఆ నష్టాన్ని భర్తీ చేయాలంటే తదుపరి చేయనున్న సినిమాలకు కూడా 12 కోట్లు తీసుకోవాల్సిందేనని ఫిక్స్ అయ్యిందట. కానీ, నిర్మాతలు మాత్రం దీపికాకు అంత ఇవ్వడానికి ఫిక్స్ అవ్వడంలేదని సమాచారం. 'బాజీరావ్ మస్తాని' సినిమా కోసం 10 కోట్ల పారితోషికం తీసుకున్న ఆమె, ఆ తరువాత సినిమా కోసం 12 కోట్ల పారితోషికాన్ని తీసుకుంది. ఇప్పటి వరకూ ఇండియాలో ఓ హీరోయిన్ తీసుకున్న హయ్యెస్ట్ రెమ్యునరేషన్ "బాజీ రావ్ మస్తానీ" కోసం దీపిక అందుకున్నదే. ఇదీ ఇప్పుడు దీపికా కి ఉన్న డిమాండ్

బాలీవుడ్ లో కొంతమంది హీరోలు తీసుకునే పారితోషికం కన్నా ఇది ఎక్కువే. అంతెందుకు ఇదే సినిమాలో నటిస్తున్న హీరోలంకటే దీపికా పారితోషికమే ఎక్కువ కావడం ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. బాలీవుడ్ లో హీరోలకి మించి ఒక హీరోయిన్ ఎక్కువ రెమ్యునరేషన్ తీసుకోవడం నిజంగా విశేషమే. అదే విషయాన్ని ఇప్పుడు అంతా చర్చించుకుంటున్నారు.



# విమర్శలకు అభివృద్ధితోనే సమాధానం

## మూడేళ్ల పాలనపై మేయర్ శ్రీధర్



విజయవాడ : నగరపాలక సంస్థ పాలకపక్షంగా తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధుల సహకారంతో రూ.1000 కోట్లు ఖర్చుచేసి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని మేయర్ కోనేరు శ్రీధర్ తెలిపారు. కౌన్సిల్ ఏర్పడి మూడేళ్లు గడిచిన సందర్భంగా నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫ్లోర్‌లీడర్ హరిబాబుతో కలిసి ఆయన మాట్లాడారు. నగరంలో వర్షపునీటి డ్రెయిన్ల నిర్మాణం కోసం కేంద్రం రూ.461 కోట్లు విడుదల చేయగా, 59 డివిజన్ల పరిధిలో పెద్దఎత్తున పనులు చేపడుతున్నామని చెప్పారు. మరోవైపు ప్రజలపై ఎటువంటి భారాలు మోపకుండా నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. పలు వాణిజ్య సముదాయాల నిర్మాణాలను ఆదాయ వనరులుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రూ.37 కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో అనేక పనులు చేపట్టామని, నగరంలో 30 వేలకు పైగా ఎల్‌ఈడీ దీపాలు అమర్చామని వివరించారు. రూ.10 కోట్లతో సర్కిల్-1 పరిధిలో షాదీఖానా నిర్మాణం, రూ.47.52 కోట్లతో బుడమేరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని అన్నారు. మరో రూ.10 కోట్లతో పాతబస్తీ ముంపు సమస్య నివారణకు చర్యలు వెల్లడించారు. అందులో నెలకొన్న కొద్దిపాటి సమస్య పరిష్కారానికి రైల్వే డీఆర్‌ఎంతో చర్చిస్తున్నామని చెప్పారు. కనకదుర్గ పైవంతెన నిర్మాణం వల్ల ఇతర సమస్యలకు స్వస్తిపలికేలా రహదార్లను బలోపేతం చేశామని మేయర్ చెప్పారు. గతంలో ప్రారంభించి సక్రమంగా ముందుకు సాగని జెఎన్ఎన్ యూఆర్ఎం ఇళ్లను పూర్తిచేసి పేదలకు కేటాయించామని, మిగిలి ఉన్న ఇళ్లను సైతం పూర్తిచేస్తున్నామని తెలిపారు. అప్పట్లో రూ.450 కోట్ల అప్పుల్లో నగరపాలక సంస్థ ఉండగా, తాము బాధ్యతలు తీసుకున్నాక చాలా వరకు అప్పులు తగ్గించగలిగామని శ్రీధర్ చెప్పారు. ప్రస్తుతం వివిధ స్థాయిల్లోని లోపాలను సవరించడం ద్వారా నగరపాలక సంస్థ ఆస్తిపన్ను వసూళ్లు రూ.90 కోట్లకు పెరిగాయని వెల్లడించారు.

తాము అధికారంలోకి వచ్చాక విమర్శకులకు ఇలా అనేక అభివృద్ధి పనుల ద్వారానే సమాధానం ఇవ్వగలిగామని పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉపమేయర్ గోగుల రమణారావు, కమిషనర్ జె.నివాస్, అన్నిపక్షాల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# ఐఐటీల్లో ప్రవేశాల ప్రక్రియపై సుప్రీం స్టే



దిల్లీ: దేశంలో ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలైన ఎన్‌ఐటీలు, ఐఐటీల్లో ప్రవేశాల ప్రకియను నిలిపివేస్తూ సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు హాజరైన విద్యార్థులందరికీ బోనస్ మార్కులు కలపడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఏడు ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు ఆన్సర్ కీలో గల్లంతయ్యాయి. దీంతో అందరికీ సమానంగా ఆ మార్కులను కలిపేందుకు నిర్ణయించిన నేపథ్యంలో ఐశ్వర్య అగర్వాల్ అనే విద్యార్థిని ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన న్యాయస్థానం ఐఐటీ ప్రవేశ ప్రక్రియను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అడ్మిషన్లు చేపట్టరాదంది. అనంతరం ఈ కేసు విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

# సరుకులపై జీఎస్‌టీ ధరలు లేకుంటే జైలుకే!

## రామ్‌విలాస్ పాశ్వాన్



దిల్లీ: వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) శ్లాబుల్లోని కొత్త ధరలను ఇప్పటికే ఉన్న సరుకులపై ముద్రించాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ దుకాణాదారులు, వ్యాపారులకు స్పష్టం చేశారు. లేదంటే లక్ష రూపాయల జరిమానా, జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. కొత్త ధరలతో పాత సామగ్రిని సెప్టెంబర్ లోపు అమ్ముకోవాలని తయారీ దారులకు ప్రభుత్వం గడువు విధించింది.

జీఎస్‌టీ అమలుతో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం వినియోగదారుల మంత్రిత్వ శాఖ హెల్ప్‌లైన్ సేవలను 14 నుంచి 60 పెంచింది. ఇప్పటికే 700కు పైగా వచ్చిన సందేహాలను ఫైనాన్స్ నిపుణుల ద్వారా నివృత్తి చేస్తున్నారు.

అమ్ముడుపోని సరుకులపై సవరించిన ధరలు ముద్రించాలని ఇప్పటికే సంస్థలను ఆదేశించాం. కొత్త ధరలతో స్టిక్కర్లు అంటిస్తే వినియోగదారులకు అవి జీఎస్‌టీ ధరలని తెలుస్తుంది. ఇది తప్పనిసరి.

లేదంటే కఠిన చర్యలు తీసుకొంటాం. తొలుత రూ.25,000, రెండోసారి రూ.50,000 ఆ తర్వాత లక్ష రూపాయల జరిమానా విధిస్తారు.

అప్పటికీ మారకపోతే జైలుశిక్ష విధిస్తాం. ప్రారంభ దశలో జీఎస్‌టీ అమల్లో ఇబ్బందులు ఉంటాయి. అవన్నీ త్వరలోనే పరిష్కారం అవుతాయి.

ఫైనాన్స్, వినియోగదారుల సహా అన్ని మంత్రిత్వ శాఖలు వ్యాపారులు, వినియోగదారుల సమస్యలు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నాయి అని పాసవాన్ అన్నారు.

# కోహ్లీ శతకం... సిరీస్ భారత్ కైవసం






జమైకా: విండీస్‌పై భారత్ అద్భుత విజయం సాధించింది. భారత్‌తో సిరీస్ సమమే లక్ష్యంగా బరిలోకి దిగిన వెస్టిండీస్ ఏస్ పేసర్లు మహ్మద్ షమి (4/48), ఉమేష్ యాదవ్ (3/53) ధాటికి విలవిల్లాడింది. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా గురువారం ఇక్కడ జరిగిన ఆఖరి మ్యాచ్‌లో ఆతిథ్య విండీస్ భారీ స్కోరు అవకాశాలను ఈ ఇద్దరూ దెబ్బకొట్టారు. సిరీస్ నిర్ణాయక ఐదో వన్డేలో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ నిర్ణీత ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 205 పరుగులు మాత్రమే చేసింది. షై హోప్ (51), కైల్ హోప్ (46) రాణించారు. కెప్టెన్ జాసన్ హోల్డర్ (36), రోవ్‌మన్ పావెల్ (31) ఫర్వాలేదనిపించారు. మూడు వికెట్లు పడగొట్టిన ఉమేష్ యాదవ్ ఆరంభంలో విండీస్‌కు బ్రేకులు వేయగా.. ఆఖర్లో అదరగొట్టిన షమి నాలుగు వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. అనంతరం 206 పరుగుల ఛేదనకు దిగిన భారత్ సులువుగా లక్ష్యాన్ని అధిగమించింది. నాలుగో వన్డేలో అనూహ్య విజయం సాధించిన విండీస్ చివరి వన్డేలో ఆ పోరాట పటిమ చూపించలేకపోయింది.

గత మ్యాచ్‌లో లాగే ఛేదనలో భారత్‌ను కట్టడి చేసి సిరీస్‌ను సమం చేయాలనుకున్న విండీస్కు విరాట్ చుక్కలు చూపించాడు.

ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి(111 నాటౌట్: 115 బంతుల్లో 12x4, 2x6) అజేయ శతకం ముందు విండీస్ టార్గెట్ తేలిపోయింది. విరాట్ కోహ్లి శతకం, దినేశ్ కార్తిక్ అర్ధశతకంతో రాణించడంతో భారత్ 36.5 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది.

దీంతో వెస్టిండీస్‌పై 8 వికెట్ల తేడాతో భారత్ ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను విరాట్ కోహ్లి అందుకోగా.. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును ఆజింక్య రహానె దక్కించుకున్నాడు.

# భూసేకరణ చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం

తాడేపల్లి : సీఆర్‌డీఏను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం మూడు పంటలు పండే భూములను బలవంతంగా తీసుకుంటోందని మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో గత నెల 27న నమోదైన కేసుకు సంబంధించి సీఆర్పీసీ 41ఏ కింద జారీ చేసిన తాఖీదును ఆయన న్యాయవాదితో వచ్చి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టానికి వ్యతిరేకంగా చంద్రబాబునాయుడు వ్యవహరిస్తున్నారన్నారు. స్వచ్ఛందంగా భూములు ఇస్తే ల్యాండ్ పూలింగ్‌లో తీసుకుంటామని చెప్పిన తర్వాత కూడా భూసేకరణకు ముందుకు రావడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ల్యాండ్ పూలింగ్ కింద 33 వేల ఎకరాలు తీసుకుని కేవలం 20 ఎకరాల్లో తాత్కాలిక భవనాలు నిర్మించారన్నారు. వెలగపూడికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెనుమాకలో ఏడాదికి మూడు నుంచి ఐదు పంటలు పండే భూములను తీసుకోవడానికి వీల్లేదన్నారు.

బలవంతంగా భూసేకరణ చేసేందుకు సీఆర్‌డీఏ చట్టవిరుద్ధంగా నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. న్యాయస్థానం ఉత్తర్వులిచ్చినా రైతుల అభ్యంతరాలను అధికారులు పరిగణనలోకి తీసుకోలేదన్నారు. సీఆర్‌డీఏ గతనెల 27న నిర్వహించిన సమావేశంలో రైతుల అభ్యర్థనలను నమోదు చేయలేదని, కనీసం మినిట్స్‌లో రాయమన్నా.. డిప్యూటీ కలెక్టర్ వ్యతిరేకించారని ఇదే విషయాన్ని రాసివ్వాలని అడిగినా ఇవ్వలేదన్నారు.

ఈ పరిస్థితుల్లోనే రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. ఈసంఘటనపై తనతోపాటు మరో పది మంది రైతులపై కేసులు బనాయించారన్నారు.

# ఐపీఎల్‌లోకి మళ్లీ షేన్‌వార్న్..?



ఆస్ట్రేలియా స్పిన్ దిగ్గజం షేన్‌వార్న్ మళ్లీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్లోకి అడుగుపెట్టనున్నాడు. వచ్చే ఏడాది జరగనున్న ఐపీఎల్ 11వ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకి కోచ్‌గా షేన్‌వార్న్ రానున్నట్లు వార్తలు వస్తున్నా యి. బెట్టింగ్ నేపథ్యంలో 2015లో చెన్నై సూపర్ కింగ్స్ పాటు రాజస్థాన్ రాయల్స్ జట్టుపై రెండేళ్ల పాటు నిషేధం విధించారు. తాజాగా ఈ ఏడాది జులై 14తో ఈ నిషేధం ముగియనుంది. దీంతో వచ్చే సీజన్ నుంచి ఈ రెండు జట్లు మళ్లీ ఐపీ ఎల్‌లోకి అడుగుపెట్టనున్నాయి.

# జిల్లాలో డెల్టా ఆధునికీకరణ పనులు 64.14 శాతం పూర్తి

విజయవాడ : కృష్ణా జిల్లా నీటి పారుదల అభివృద్ధి మండలి (ఐఏబీ) 29వ సమావేశాన్ని ఈనెల 7వ తేదీ మూడు గంటలకు విజయవాడలోని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి విడిది కార్యాలయం సమీపంలోని రైతు శిక్షణ కేంద్ర భవనంలో నిర్వహించనున్నారు. కలెక్టరు బి.లక్ష్మీకాంతం అభివృద్ధి మండలి ఛైర్మన్ హోదాలో అధ్యక్షత వహించి సమావేశాన్ని నిర్వహిస్తారని జలవనరుల శాఖ ఎస్ఈ కె.శ్రీనివాసరావు చేసిన ఓ ప్రకటనలో తెలిపారు.

జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర జలవనరుల అపెక్సు కమిటీ సభ్యులు, పీసీ, డీసీ ఛైర్మన్లు తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

# వారాంతంలో స్వల్ప నష్టాలు

ముంబయి: స్థిరాస్తి, బ్యాంకింగ్ రంగాల సందడితో గురువారం ట్రేడింగ్‌లో భారీ లాభాలతో ముగిసిన సూచీలు.. వారాంతంలో నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించడంతో దేశీయ సూచీలు ఆద్యంతం స్తబ్దుగా సాగాయి. చివరకు స్వల్పంగా నష్టాలను చవిచూశాయి.

సెన్సెక్స్ 9 పాయింట్లు కోల్పోయి 31,361 వద్ద.. నిఫ్టీ 9 పాయింట్ల నష్టంతో 9,666 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.64.65గా కొనసాగుతోంది.






Editor : Bete Sai Trilok, Printed and Published by Bete Chandra Sekhar on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from D.No:58-3-15/1A, Atchamma Street, Patamata, Vijayawada-520 010, A.P. and Printed at **VIJAYABHANU PRESS,** D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam -530 003, RNI No.APTEL/2008/24468, ☆ e-mail: vijayabhanudaily@gmail.com